నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

1

శనివారం నవంబర్ 02, 2024 www.navatelangana.com

దీపావళి వేళ.. నీటి కోసం ఆందోళన

- ఖాళీ బిందెలతో నిరసన చేపట్టిన మహిళలు

నవతెలంగాణ-పోతంగల్



తాగునీటి కోసం మహిళలు ఆందోళన చేపట్టారు. దీపావళి పండుగ పూట సైతం నీళ్లు రాకుంటే పండుగలు ఎలా నిర్వహించుకోవాలని ప్రశ్నించారు. పోతంగల్ మండలంలోని టాక్లి గ్రామంలో గురువారం మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన చేపట్టారు. గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వల్లే మంచినీటి అవస్థలు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. నీటి సమస్య ఉందని చెప్పినా.. పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక నాయకులు స్పందించి.. మిషన్ భగీరథ ఏఈకి ఫోన్‌లో సంప్రదించి సమస్యను వివరించారు. కాగా నీటి సమస్య పరిష్కారం కోసం చేస్తానని ఆయన చెప్పడంతో మహిళలు ఆందోళన విరమించారు.

అనుమతిలేకుండా ర్యాలీలు, ధర్నాలు, సభలు చేపట్టొద్దు

- జిల్లాలో 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు : ఎస్పీ సింధుశర్మ

నవతెలంగాణ-కామారెడ్డి



జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని (నవంబర్ 1వ తేది నుంచి 7వ వరకు) జిల్లా వ్యాప్తంగా 30,30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని కామారెడ్డి జిల్లా ఎస్‌పి, సిహెచ్.సింధు శర్మా ఐపిఎస్ ఒక ప్రకటనలో తెలిపిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. ప్రజా ధనాన్ని నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు తమకు ఈ విషయంలో సహకరించాలని కోరారు.

చి'వరి'కి కన్నీరే

- వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం
- ప్రభుత్వ ముందుచూపు లేని తనం, ప్రకృతి ప్రకోపానికి బలవుతున్న రైతు
- సకాలంలో తూకం వేస్తే నష్టపోయేవాళ్లం కాదంటూ వాపోత

నవతెలంగాణ-గాంధారి/లింగంపేట్/సదాశివనగర్/మోపాల్

ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక లేకపోవడం, అనాలోచిత నిర్ణయాలు రైతుల పాలిట శాపంగా మారుతున్నాయి. రైస్‌మిల్లర్ల అక్రమాలపై చర్యలు తీసుకునే అంశంపై దృష్టి సారించిన ప్రభుత్వం.. రైతులు పడుతున్న ఇక్కట్లను పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఆరుగాలం శ్రమటోడ్చి సాగు చేసిన ధాన్యం.. చేతికందినట్టే అంది చేజారుతోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించినా తూకం వేయపోవడంతో.. అకాల వర్షాలు రైతులను నట్టేట ముంచుతున్నాయి. రైస్‌మిల్లర్ల కేటాయింపుల అంశమై.. ముందస్తుగా ప్రభుత్వం చర్యలు తీసుకొని ఉంటే తాము నష్టపోయేవాళ్లం కామని రైతులు వాపోతున్నారు. ముందునుంచి భావించినట్టే వాతావరణ మార్పులు, తూఫాన్ ప్రభావంతో గురు, శుక్ర వారాల్లో పలు చోట్ల భారీ వర్షం కురిసింది. దీంతో కోత కోసం ఆరబెట్టిన ధాన్యం తడిచిముద్దయింది. కొనగోలు కేంద్రానికి ధాన్యం తరలించినా తూకం వేయకపోవడంతో రైతులు ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు కాస్తున్న విషయం విధితమే. కామారెడ్డి జిల్లా గాంధారి, లింగంపేట్, సదాశివనగర్ మండలాల్లోని పలు గ్రామాల్లో గురు, శుక్రవారాల్లో భారీవర్షం కురిసింది. దీంతో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోగా.. కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన



లింగంపేట్ : వర్షపునీటితో కొట్టుకుపోయిన ధాన్యాన్ని కుప్పచేస్తున్న రైతు



మోపాల్ :మంచిప్ప వద్ద కొట్టుకుపోయిన ధాన్యం

ధాన్యం తడిచి ముద్దయింది. నిజామాబాద్ జిల్లా మోపాల్‌లో సైతం రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోయి రైతులకు తీవ్ర నష్టం చేకూర్చింది.

గాంధారి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. అదే విధంగా శుక్రవారం మధ్యాహ్నం సైతం భారీ వర్షం కురిసింది దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండించిన పంటలు ప్రభుత్వం సకాలంలో కొనకపోవడంతో మార్కెట్ యార్డుల్లో కళ్ళల్లో గత 15 రోజులుగా రైతులు వడ్లను కుప్పలుగా పోసి ఉంచారు. గురు, శుక్రవారాల్లో కురిసిన వర్షంతో వరికుప్పలు మొత్తం వర్షం నీటితో తడిచి ముద్దయ్యాయి. దీంతో రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

మోపాల్ : భారీ వర్షానికి మోపాల్ మండలంలోని మంచిప్ప తదితర ప్రాంతాలలో ఆరబోసిన వడ్లు తడిసి ముద్దయ్యాయి, ఆరుకాలం కష్టపడి పండించిన రైతుకి చివరికి కన్నీళ్లు మిగిలాయి. రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి కొనుగోలు కేంద్రాలని తూతూ మంత్రంగా కాకుండా నిక్కచ్చిగా ప్రారంభించాలని రైతుల కోరుతున్నారు.

లింగంపేట్ : లింగంపేట్ మండలంలోనీ ఆయా గ్రామాలలో శుక్రవారం అకాల వర్షం కురవడంతో అన్నదాతలు కష్టపడి పండించిన ధాన్యం వరదలో కట్టుకుపోయింది. లింగంపేట్ మండలంలోని జల్దిపల్లి, భవానీపేట్, కంచుమల్, కొండాపూర్,పర్మల్ల, మెంగారం, శెట్పల్లి, బోనాల్, బాయంపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి వరి ధాన్యం, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం మొత్తం తడిసి ముద్దయింది. వరద తాకాడికి ఆరబెట్టిన ధాన్యం కొట్టుకపోయింది. సాగు కోసం వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి అప్పులు చేసి వరి పంటను వరి పంటను సాగు చేస్తే అకాల వర్షాలు రైతులకు భారీ నష్టాన్ని కలిగిస్తున్నాయని అప్పుల పాలు కావలసి వస్తుందని వారు వాపోతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను అట్టహాసంగా ప్రారంభించినప్పటికిని ఇప్పటికి ఏ కేంద్రంలో కూడా ధాన్యం తూకాలు ప్రారంభం చేయలేదని, దీంతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని వాపోతున్నారు. వెంటనే తూకం ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



గాంధారిలో కుప్పలపై పట్టాలు కప్పుకున్న రైతులు



సదాశివనగర్‌లో ధాన్యంపై నిలిచిన నీరు

దీపావళి వేళ.. పేకాట జోరు



- నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 116 కేసులు
- 11 లక్షల 47 వేల 240 రూపాయల నగదు స్వాధీనం
- కామారెడ్డిలో 5.48 నగదు పట్టివేత

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఆర్మూర్/బోధన్/కామారెడ్డి

దీపావళి పండుగ వేళ పేకాట జోరుగా సాగింది. పలుచోట్ల బహిరంగంగానే పేకాట ఆడినా.. మరికొన్ని చోట్ల ప్రత్యేక ప్రదేశాలను ఎంపిక చేసుకొని గుట్టుగా సాగించారు. కోట్ల రూపాయల్లో చేతులు మారినట్టు సమాచారం. కాగా సమాచారాలు వచ్చిన చోట పోలీసులు వెళ్లి రైడ్‌చేసి పలువురిని పట్టుకున్నారు.

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా కమిషనరేట్ పరిధిలో మొత్తం 116 కేసులలో 597 మంది అదుపులోకి తీసుకోగా వారి వద్ద నుండి రూ.11,47,240 స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబాద్ ఇంచార్జీ పోలీస్ కమీషనర్ సింధు శర్మ శుక్రవారం తెలిపారు. నిజామాబాద్‌లో దీపావళి పండుగ సందర్భంగా పేకాట ఆడుతున్న వారిని డివిజన్ల వారిగా కేసులు నమోదు చేశారు.

నిజామాబాద్ కమీషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో మొత్తం 116 కేసులు నమోదు చేయడంతో పాటుగా మొత్తం రూ.11,47,240 స్వాధీనం చేసుకోవడం జరిగింది. పూర్తి వివరాలు.. నిజామాబాద్‌లో కేసుల సంఖ్య 53, 267 మంది, మొత్తం రూ.5,03,570 స్వాధీనం. ఆర్మూర్‌లో కేసులు 26, 138 మంది, మొత్తం రూ.2,85,570, బోధన్‌లో కేసులు 37, 192 మంది, మొత్తం రూ.3,58,100 స్వాధీనం చేసుకోగా మొత్తం మూడు డివిజన్‌లు కలిపి 116 కేసులు, 597 మంది, రూ.11,47,240 స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా పేకాట స్థావరాలపై నియంత్రించడానికి ప్రత్యేక నిఘా, ప్రత్యేక టీం కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

కామారెడ్డిలో 5.48 లక్షల నగదు స్వాధీనం

కామారెడ్డి : జిల్లాలోని ఎవివిధ పోలీస్ స్టేషన్ పరిదిలో పేకాట ఆడినందుకు గాను పలువురుపై కేసు నమోదు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ సింధు శర్మ ఒక ప్రకటన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ.. గ్రామాలలో, పట్టణాలలో ఫామ్‌హౌస్‌లలో, ఇళ్ళల్లో, బహిరంగ ప్రదేశంలో పేకాట, జూదం మరే ఇతర చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్టు తెలిస్తే వెంటనే కామారెడ్డి టాస్క్‌ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712686109, 8712686133 లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు, 100 డైల్‌కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.

నాగిరెడ్డిపేట్ : నాగిరెడ్డిపేట మండలంలోని బెజగం చెరువు తండా గ్రామపంచాయతీ పరిధిలో గల పాశంకుంట సమీపంలో పేకాడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ మల్లారెడ్డి తెలిపారు. వారి వద్ద ఉన్న తొమ్మిది సెల్ ఫోన్లను, తొమ్మిది వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

6 నెలలవుతున్నా.. 1.5 కి.మీ రోడ్డు వేయలే

మట్టిపోసి వదిలేయడంతో దుమ్ము, ధూళితో ప్రయాణికులకు ఇక్కట్లు

నవతెలంగాణ-రామారెడ్డి

రోడ్డు పాడవడంతో పునర్ నిర్మాణం కోసం చేపట్టిన పనులు పూర్తి కాకపోవడంతో తండా వాసులతో పాటు, వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కామారెడ్డి జిల్లాలోని రామారెడ్డి మండలం ఘన్పూర్ ఆర్ తండా నుండి రెడ్డి పేట వరకు దాదాపు 1.5 కిలోమీటర్లు రోడ్డు మరమ్మతు లో భాగంగా, బీటీ రోడ్డును పూర్తిగా తొలగించి, కొత్త రోడ్డు నిర్మాణం పనులు ఆరు నెలల క్రితం ప్రారంభించారు. అయితే మట్టి వేసి వదిలేయడంతో దాదాపు 6 నెలల నుండి దుమ్ము, ధూళితో తండా వాసులు, ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. దుమ్ము ఇండ్లల్లోకి వస్తుండటంతోస్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చినుకు పడితే చిత్తడిగా మారే రోడ్డుపై నుండి వెళ్తున్న వాహనదారులు, బురదతో అదుపుతప్పి పడి, గాయాలైన ఘటనలు ఎన్నో ఉన్నాయని వాహనదారులు, తండావాసులు ఆరోపిస్తున్నారు. గుంతలుగా ఏర్పడిన మట్టి రోడ్డుపై రెడ్డి పేట నుండి సింగరాయ పల్లి, పోతారం, ఇసాయిపేట్, భవానీపేట్, చుక్కాపూర్ లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి ఈ రోడ్డు నుండే వెళుతుంటారు. రైతులకు పంట చేతికి వచ్చే సమయంలో పంటను తరలించడానికి రైతులు, ఈ రోడ్డు పై నుండి రైస్ మిల్ కు, కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలిస్తూ ఉంటారు. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే, ప్రజల ఇబ్బందుల దృష్ట్య రోడ్డును మరమ్మతు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు పనుల్లో భాగంగా మట్టిపోసి విస్మరణ

వచ్చివెళ్లేందుకు ఇబ్బందులు

బానోత్ బాలునాయక్. గన్‌పూర్ తండా



ఆరు నెలల నుండి రావడానికి, పోవడానికి చాలా ఇబ్బందిగా ఉంది. వర్షం పడితే దారి మొత్తం బురదతో నిండిపోతుంది. వరి పంటలు కోస్తున్న సమయంలో ధాన్యాన్ని తరలించాలంటే ఇబ్బందిగా ఉంది. అధికారులు వెంటనే స్పందించి రోడ్డును పునర్నిర్మాణం చేయాలని కోరుతున్నాము.

రాత్రిపూట ప్రమాదాలబారిన పడుతున్నాం

మాలోత్ లక్ష్మి. గన్‌పూర్ తండా



రోడ్డు పనులు ప్రారంభించిన నుండి, ఇండ్లలోకి దుమ్ము ధూళి రావడం ఇబ్బందిగా ఉంది. పిల్లలు బడికి వెళ్లాలంటే బురదలో వెళ్ళవలసి వస్తుంది. బొందలుగా మారిన రోడ్డుపై వెళ్లాలంటే రాత్రి పూట చాలా ఇబ్బంది ఉంది. సార్లు స్పందించి వెంటనే రోడ్డును మంచిగా చేయాలి.

పనులు త్వరలో పూర్తిచేస్తాం.

రవిశంకర్. ఆర్అండ్‌బి ఈఈ

రోడ్డు సమస్య మీ ద్వారా మా దృష్టికి వచ్చింది. సంబంధిత పూర్తి వివరాలను సంబంధిత అధికారుల నుండి తీసుకొని, రోడ్డు పనులు త్వరగా పూర్తి చేస్తాం.

ఇన్వెస్టిగేషన్ సకాలంలో పూర్తిచేయాలి

- సైబర్‌క్రైమ్ బాధితులకు డబ్బులు రీఫండ్ అయ్యేలా చూడాలి
- సమీక్షలో ఎస్పీ సింధుశర్మ

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రతి కేసులో నాణ్యమైన ఇన్వెస్టిగేషన్ త్వరితగతిన పూర్తి చేసి భాదితులకు అండగా నిలవాలని సమీక్షలో ఎస్పీ సింధుశర్మ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఎస్పీ సింధు శర్మ నెల వారి నేర సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. పెండింగ్ (అండర్ ఇన్వెస్టిగేషన్) లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్ నేరస్తులను పీ టి వారెంట్ ద్వారా కోర్టు లో ప్రవేశపెట్టి సైబర్ బాధితులకు భాసటగా నిలవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించి, ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను ఆక్సిడెంట్ స్పాట్ ఏరియాలుగా గుర్తించి, సైన్ బోర్డులను ఏర్పాటు చేయించాలని సూచించారు. తరచూ వెహికిల్ చెకింగ్ నిర్వహిస్తూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు నిర్వహించాలన్నారు. సైబర్‌క్రైమ్ బాధితులకు డబ్బులు రీ ఫండ్ అయ్యే విధంగా చూడాలని సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయములో రెండు వారాల స్టేషన్ రైటర్ శిక్షణ పూర్తి చేసుకున్న 18 మంది మహిళా అధికారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అదన ఎస్పి అడ్మిన్ కే నరసింహారెడ్డి,డిఎస్‌పిలు నాగేశ్వరరావు, సత్యనారాయణ, ఎస్బి ఇన్స్పెక్టర్ జార్జ్ , డిసిఆర్‌బి ఇన్స్పెక్టర్ మురళి , జిల్లాలోని సీఐలు, తదితరులు పాల్గొన్నారు.

తప్పిదాలు తలెత్తొద్దు

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- ఇళ్ల జాబితా రూపకల్పన ప్రక్రియ పరిశీలించిన కలెక్టర్‌లు

నవతెలంగాణ-బోధన్/కామారెడ్డి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటి సర్వేను పకడ్బందీగా, తప్పిదాలకు చోటు లేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. శుక్రవారం బోధన్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో, బోధన్ మండలంలోని లంగ్డాపూర్‌లో ఆయన సర్వే ప్రక్రాయలో భాగంగా ఇళ్ల జాబితా రూపకల్పన ప్రక్రియను పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ, కుల వివరాల సేకరణకై ప్రభుత్వం ఈ నెల 6వ నుంచి ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నట్టు తెలిపారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను జిల్లాలో పకడ్బందీగా, పక్కాగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. మున్సిపల్ పట్టణంలోని రాకాసిపేట్‌తో పాటు లంగ్డాపూర్ గ్రామంలో అధికారులు, సిబ్బంది ఇళ్ల జాబితా రూపకల్పన కోసం చేపడుతున్న చర్యలు, పాటిస్తున్న పద్ధతులను కలెక్టర్ పరిశీలించారు. ఏ ఒక్క నివాస గృహం సైతం మినహాయించబడకుండా పక్కా పరిశీలనతో హౌస్ లిస్టింగ్ చేయాలని, ఎలాంటి గందరగోళానికి తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



సిబ్బందికి సూచనలిస్తున్న నిజామాబాద్ కలెక్టర్

ముఖ్యంగా మున్సిపల్ పట్టణాల పరిధిలో ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. సర్వే కోసం ఎన్యుమరేషన్ బ్లాక్‌లోని ప్రతి ఇంటికి క్రమానుగత సంఖ్యను కేటాయించాలని, ఇళ్ల జాబితా పక్కాగా రూపొందితే సర్వే సమగ్రంగా చేపట్టబడుతుందని తెలిపారు. నిర్దేశిత సర్వే ప్రణాళికను అనుసరిస్తూ మూడు రోజుల్లోపు హౌస్ లిస్టింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఎక్కడ కూడా డూప్లికేషన్ లేకుండా హౌస్ లిస్టింగ్ చేయాలని, ప్రభుత్వ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ జిల్లాలో సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, తహసీల్దార్ విఠల్, ఇంచార్జి డీఎల్పీఓ మధుకర్, తదితరులు ఉన్నారు.

ఒక్క ఇంటిని వదలకుండా సర్వే చేయాలి

కామారెడ్డి : ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వాసవీ హై స్కూల్ సమీపంలోని వార్డులో జరుగుతున్న ఇంటింటి సర్వేను కలెక్టర్ పరిశీలించారు. సర్వే ప్రతీ ఇంటిలో నిర్వహించాలని, కుటుంబంలోని ప్రతీ ఒక్కరి సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. ఆ ఇంటిలోని సమాచారాన్ని సేకరించిన అనంతరం స్టిక్కర్ అంటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రంగనాథ్ రావు, మున్సిపల్ చైర్ పర్సన్ ఇందుప్రియా, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

మరుగుదొడ్ల డబ్బులు ఇంకా ఇవ్వలే



ఇందల్‌వాయి మండలం గౌరారం జీపీ

ఓ లబ్దిదారు నిర్మించుకున్న మరుగుదొడ్డి(ఫైల్)

- గతంలో నిధులు లేమితో గ్రామసంఘాల నుంచి సర్దుబాటు
- వాటికి తిరిగి చెల్లించని పంచాయతీలు
- ప్రతి సారి అడిట్ సమయంలో ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మరుగుదొడ్డి లేని ఇల్లు ఉండొద్దనే ఉద్దేశ్యంతో గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇచ్చాయి. మరుగుదొడ్డి నిర్మించుకుంటే రూ.12 వేలు చెల్లించాయి. నాడు జిల్లా మొత్తంలో గ్రామ పంచాయతీలలో డబ్బులు లేక పోవడంతో ప్రత్యామ్నాయంగా ఆయా గ్రామాలలో గ్రామ సంఘాల నుండి అప్పుగా డబ్బులు సేకరించి సంబంధింత కాంట్రాక్టర్‌కు ముందస్తుగా డబ్బులు చెల్లించి యుద్ధ ప్రాతిపదికన మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేయించి మరుగుదొడ్లు ఉన్న గ్రామంగా ప్రకటించుకున్నాయి. తదనంతరం ప్రభుత్వం నుండి నిధులు రావడంతో జిల్లాలోని దాదాపు అన్ని మండలాలు ఇతరుల వద్ద తీసుకున్న డబ్బులు చెల్లించారు. కానీ ఇందల్‌వాయి మండలంలోనే గ్రామ సంఘాల వద్ద తీసుకున్న డబ్బులు నేటి వరకు అప్పు, వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంది. ఇదే విషయమై గ్రామాల్లో ప్రతి సారి జరిగే గ్రామ సభలో, సర్పంచ్లు, ఎంపిటిసిలు, ఎంపీపీ , జడ్పీ టిసి, అధికారులకు, మండల పరిషత్ సమావేశం ఇతరత్రా సభలో గ్రామ సంఘాలకు వచ్చే డబ్బులు విషయమై సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. అయినా కానీ డబ్బులు చెల్లించి సమస్యను పరిష్కరించే వారే కరువైయ్యారు.

2019లో ఐహెచ్‌హెచ్ఎల్ మరుగుదొడ్ల నిర్మాణంలో భాగంగా ఇందల్‌వాయి మండలంలోని పలు గ్రామాలలోని గ్రామపంచాయతీలలో డబ్బులు లేక పోవడంతో గ్రామ సంఘాల వద్ద అప్పుగా డబ్బులు తీసుకున్నారు. గ్రామ సంఘాల వద్ద తీసుకున్న డబ్బులు నేటి వరకు చెల్లించకపోవడంతో ఆ డబ్బులు విషయంపై అయోమయం నెలకొని ఉంది. మరుగుదొడ్లు లేని వారికి మరుగుదొడ్ల నిర్మాణం కు లబ్దిదారుడు ఒక్కొక్కరి నుండి 900 రూపాయలను ఆనాడు వసూలు చేశారు. ఈ 900 రూపాయల నుండి లబ్దిదారునికి రెండు బకెట్లు, డ్రమ్ము, మగ్గు, బ్రష్ కొనుగోలు చేసి అందజేశారు.

ఆనాడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధులు రాక పోవడంతో గ్రామ సంఘాల నుండి ఆనాటి కలెక్టర్ యోగితరాణా ఆదేశాల మేరకు గ్రామపంచాయతీలకు నిధులను అప్పుగా అందజేశారు. దానికి సంబంధించిన నిధులు గ్రామపంచాయతీ అకౌంట్లో వచ్చిన తర్వాత గ్రామ సంఘాలకు రూపాయి చొప్పున వడ్డీతో కలిపి అందజేయాలని ఆనాడు అధికారులు పలు గ్రామ పంచాయతీలకు ఆదేశించారు. ఐహెచ్‌హెచ్ఎల్ మరుగుదొడ్ల నిర్మాణానికి సర్పంచ్ కన్వీనర్‌గా, గ్రామపంచాయతీ కార్యదర్శి చైర్మన్‌గా, గ్రామ సంఘం అధ్యక్షురాలు కమిటీ సభ్యులుగా జనరల్ అకౌంట్ ను బ్యాంకుల్లో తెరిచారు. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధులు గ్రామ సంఘాల వద్ద నుండి తీసుకున్న అప్పు సగం వరకు చేర్పించి మిగిలిన డబ్బులు అత్త పత్త లేకుండా పోయిందని గ్రామ సంఘాల సభ్యులు వాపోతున్నారు.

ఇందల్‌వాయి మండలంలోని చంద్రయాన్‌పల్లి గ్రామ పంచాయతీకి రూ.2,80,000 అందజేయగా ప్రస్తుతం అప్పులతో కలిపి రూ.93,000 చెల్లించాల్సి ఉంది. ఇందల్‌వాయి మండలంలోని ఇందల్ వాయి గ్రామ పంచాయతీకి రూ.1,72,000 అందజేయగా ప్రస్తుతం అప్పులతో కలిపి రూ 82000 వేలు చేల్లించల్సి ఉంది. అదే విధంగా మండలంలోని గన్నారం గ్రామ పంచాయతీ రూ.2,75,000 అందజేయగా ప్రస్తుతం అప్పులతో కలిపి రూ. 25,000 వేలు చేల్లించల్సి ఉంది. తిర్మన్‌పల్లి గ్రామ పంచాయతీకి రూ.50,000 చెల్లించాల్సి ఉంది.

మండలంలోని గౌరరం గ్రామ పంచాయతీ రూ.1,20,000 గ్రామ సంఘాలకు చెల్లించాల్సి ఉంది. మొత్తం ఇందల్‌వాయి మండలంలోని 5 గ్రామాలకు రూ.8,97,000 వేలు అందజేయగా దీనిలో 3 గ్రామ పంచాయతీలు చంద్రయాన్ పల్లి, ఇందల్ వాయి,గన్నారం గ్రామాలు రూ.3,40000 లక్షలు తిరిగి చెల్లించాయి. మిగిలిన 5 గ్రామలకు సంబంధించిన రూ. 3,7,0000 వేల రూపాయలు 2019 నుండి నేటి వరకు వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంది.

ఆడిట్ సమయంలో ఇక్కట్లు

ప్రతి ఏటా నిర్వహించే అడిట్ సమయంలో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలుమార్లు విన్నవించినా తమ గోడు ఎవరూ వినడం లేదని సభ్యులు వాపోతున్నారు. తాము అనాటి కలెక్టర్ డాక్టర్ యోగిత రాణా ఆదేశాల మేరకు అందజేశామని లేకుంటే తాము ఒక్క రూపాయి కూడా ఇచ్చే వారము కాదని గ్రామ సంఘాల మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పైసా పైసా కుడా బెట్టుకుని అందజేశామని, ప్రస్తుతం ఆయా గ్రామాల్లో నేడు పాలకులు లేరని, అధికారులు బదిలీ అయినట్టు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ చట్టం అదికారులు, మండల స్థాయి అధికారులు బదిలీ పై వెళ్లారని, ఇప్పుడు తమకు వచ్చే డబ్బుల విషయం ఎవరు పరిష్కరిస్తారో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇక నైనా జిల్లా, మండల స్థాయి అధికారులు కల్పించుకుని తమకు గ్రామ పంచాయతీలు చెల్లించి డబ్బులు అందే విధంగా చర్యలు చేపట్టాలని వారు వేడుకుంటున్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఆలూర్ విద్యార్థిని ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కీర్తన అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పిడి రాజేష్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఎంపిక పోటీలలో కీర్తన ప్రతిభ చూపిందన్నారు. ఎంపికైన విద్యార్థిని నేటి నుంచి ఆరవ తేదీ వరకు మంచిర్యాల జిల్లాలోని ఆసిఫాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ నరేందర్, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సుధాకర్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. కొన్ని రోజుల క్రితం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. వారిది పేద కుటుంబం కావడంతో ముత్యాల సునీల్ కుమార్ శుక్రవారం రూ.5వేల ఆర్థిక సహాయాన్ని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో పంపించారు. ఈ ఆర్థిక సహాయం మొత్తాన్ని మృతుడు సుధాకర్ కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వారి ఇంటి వద్దకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు జైడి శ్రీనివాస్, సంజీవ్, రాకేష్, వెంకటేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రగ్బీలో రాష్ట్రస్థాయికి ఎంపికైన శ్రీ భాషిత విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని శ్రీ భాషిత పాఠశాలకు చెందిన ఏడవ తరగతి విద్యార్థి, ఎనిమిదవ తరగతికి చెందిన లావణ్య, హేమంత్, శ్రావిక అనే విద్యార్థులు ఇటీవల కామారెడ్డిలో నిర్వహించిన రగ్బీ ఆట సెలక్షన్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు రగ్బీ ఆటలో రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం చాలా ఆనందకరంగా ఉందన్నారు. విద్యార్థులకు విద్య ఒకటే ప్రాముఖ్యం కాదని.. విద్యలో ఆటలు కూడా ఒక భాగమేనని కొనియాడారు. ఇటువంటి ఆటలు విద్యార్థులకు ఫిజికల్‌గా ఎంతో దోహదపడుతాయని చెప్పారు. ఆటలో ఎంపికైన విద్యార్థులకు అభినందన తెలుపుతూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

3న విశ్వస్ఫూర్తి ప్రతిభా పురస్కారాలు అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ ఆచార్య పేరిట విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్టు జిల్లా అధ్యక్షులు, గౌరవ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు రాఘవాపురం గోపాలకృష్ణచార్య, మనోహర్ ఆచార్య, పొడపల్లి రాజారాం ఆచార్య శుక్రవారం తెలిపారు. ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ పూర్తిచేసి పాసైన వారు, ఐఐటి నీట్ ఎంసెట్, జె.ఇ.ఇ మెయిన్ 90శాతంపైన నీట్, ఐఐటిలలో సీట్ సాధించిన వారు, అత్యుత్తమ ర్యాంకులు సాధించిన వారికి డిగ్రీ, పీజీ ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసిన విశ్వబ్రాహ్మణ విద్యార్థిని విద్యార్థులకు విశ్వస్ఫూర్తి ప్రతిభా పురస్కారాలతోనూ, నూతనంగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన విశ్వబ్రాహ్మణ ఉద్యోగులకు సర్వీస్‌లో ప్రమోషన్లు పొందిన వారికి, సర్వీసులో ఉత్తమ పురస్కారాలు పొందిన వారికి, ఆయా శాఖల్లో సేవలందిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులకు ఈ సంవత్సరం ఉద్యోగ విరమణ పొందుతున్న విశ్వబ్రాహ్మణ ఉద్యోగస్తులందరికీ, ఆయా రంగాల్లో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శిస్తున్న విశ్వబ్రాహ్మణ కళాకారులకు, రచయితలకు, పాత్రికేయ మిత్రులకు, రాజకీయ నాయకులకు, విశ్వకీర్తి ప్రతిభా పురస్కారాలు ప్రదానం, సత్కార కార్యక్రమం ఉంటుందన్నారు. ఆర్మూర్ డివిజన్ పరిధిలోగల అన్ని మండలాలకు చెందినవారు 9391044536, 9704496588 నెంబర్లకు నిజామాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని మండలాలకు చెందినవారు 9492481288, 9550469917 నెంబర్లకు బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని మండలాలకు చెందినవారు 9963290646, 9494961238 నెంబర్లకు బయోడేటాతో పాటు, ఆధార్‌కార్డు, ఫోటో సంబంధిత ధ్రువపత్రాలు వాట్సాప్ ద్వారా పంపాలని కోరారు.

వివాహిత అదృశ్యం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



అదృశ్యమైన సరిత

వివాహిత అదృష్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మహేష్ శుక్రవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన నాగమొల్ల బాబుకు నలుగురు కూతుళ్ళ సంతానం కాగా పెద్ద కూతురు అయిన సరిత (24) గత నెల రోజుల క్రితం నుండి తన భర్తతో తరచూ గొడవల కారణంగా రుద్రారం గ్రామంలోని పుట్టింటికి వచ్చి ఉంటుందని, ఈనెల 29న ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని తెలిపారు. బంధువుల ఇళ్లలో, చుట్టూ పక్కల వెతికిన ఆచూకీ లభించకపోవడంతో యువతి తండ్రి అయిన బాబు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మహేష్ తెలిపారు.

గొప్పవ్యక్తి.. వల్లభాయ్ పటేల్

- జయంతి సందర్భంగా నివాళి

నవతెలంగాణ-కంఠేశ్వర్

సర్దార్ వల్లభాయ్ పటేల్ గొప్పవ్యక్తి అని పలువురు అన్నారు. సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా భారతదేశ ప్రభుత్వ పిలుపు మేరకు రాష్ట్రీయ ఎక్తా దివాస్ కార్యాక్రమాన్ని నిజామాబాద్ ఇంచార్జి పోలీస్ కమిషనర్ సింధుశర్మ, ఐ.పి.యస్ ఆదేశాల మేరకు 31న అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) ఆర్.కోటేశ్వరరావు, అదనపు పోలీస్ కమిషనర్ (ఎ.ఆర్) శంకర్ నాయక్ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు పోలీస్ కమిషనర్ పోలీస్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అదనపు పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. భారతదేశ ఉక్కుమనిషిగా పేరుపొందిన సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రీయ ఏక్తా దివస్ జాతీయ ఐక్యత దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో దేశ సమగ్రత (ఐక్యత) కొరకు కీలకపాత్ర పోషించిన గొప్ప వ్యక్తిగా, భారత దేశంలో గల అన్ని సంస్థానాలను విలీనం చేయటంలో ఎంతో కీలకపాత్ర పోషించారని వివరించారు. ఈ సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మార్చ్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యాక్రమంలో ట్రాఫిక్ ఎ.సి.పి నారాయణ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, రిజర్వు ఇన్‌స్పెక్టర్స్ సతీష్ కుమార్ (అడ్మిన్), తిరుపతి (ఎమ్‌టిఓ), శ్రీనివాస్ (వెల్ఫేర్), ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది, ఐ.టి కోర్ టీమ్ సిబ్బంది, పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఎ.ఆర్, స్పెషల్ పార్టీ సిబ్బంది, హెూమ్ గార్డ్సు సిబ్బంది పాల్గొన్నారు.



సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివస్‌గా పాటిస్తూ గురువారం నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలోని అసోసియేషన్ హాల్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ గుజరాత్‌లోని నడియార్‌లో వల్లభ్‌భాయ్ లధ్వ ఝువీర్ భాయ్ దంపతులకు 1875లో జన్మించి చిన్నతనం నుంచి జాతీయ భావంతో స్వతంత్ర ఉద్యమం పట్ల ఆకర్షితుడై బార్డోలి సత్యాగ్రహంలో పాల్గొని స్వతంత్రం ఉద్యమంలో కీలకపాత్ర వహించారని తెలిపారు. స్వాతంత్ర్యానంతరం మొట్టమొదటి భారత హెూంశాఖ మంత్రిగా, ఉప ప్రధానమంత్రిగా సేవలందిస్తూ భారతదేశంలో దాదాపు 550 సంస్థానాలు ముఖ్యంగా తెలంగాణ హైదరాబాద్ జూనాగడ్ లాంటి సంస్థానాలు దేశంలో విలీనం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించి భారత అఖండతనకు కృషి చేశారని కొనియాడారు. ఆయన మరణ అనంతరం ఎన్డీఏ ప్రభుత్వం భారతరత్నగా గౌరవించింది పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాద సొసైటీ అధ్యక్షులు రాజారెడ్డి, న్యాయవాదులు రాజ్ కుమార్ సుబేదార్, పడిగెల వెంకటేశ్వర్, కే శ్రీనివాస్, వెంకటరమణగౌడ్, విశ్వక్సేన్, రాజ్ సంతోష్, నారాయణ దాస్, గోవర్ధన్, ఎస్ సంతోష్, రంజిత్ సుతారి, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

- రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహేర్‌బిన్ హందాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇందిరాగాంధీ సేవలు ఎన్నటికీ మరువలేమని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. గురువారం భారత తొలి మహిళా ప్రధాని, ఇందిరాగాంధీ 40వ వర్ధంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా పులంగ్ వద్ద గల ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్, నూడా చైర్మన్ కేశ వేణు పాల్గొన్నారు. తాహెర్ బిన్ హందాన్ మాట్లాడుతూ.. ఇందిరా గాంధీ దేశానికి ఎన్నో సేవలు చేశారని తెలిపారు. దేశం అభివృద్ధి చెందడంతో ఆమె పాత్ర ఎంతో ఉందని వారు అన్నారు. ఇందిరా గాంధీ ప్రధానిగా బ్యాంకులను జాతీయం చేశారని, గారిబి హటావో నినాదంతో పేదరికాన్ని పారదోలడానికి కృషి చేసిందని వివరించారు. హరిత విప్లవం, 20 సూత్రాల పథకం వంటి ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొన్ని దేశం ఆర్థికంగా బలంగా రూపొందే విధంగా ఇందిరా గాంధీ కృషి చేశారని, ఇంత చేసిన ఆమె అంగరక్షకులు చేతిలో మరణించడం దేశాన్ని చీకటిలోకి నెట్టివేసిందని ఆయన అన్నారు. అదేవిధంగా ఇందిరాగాంధీ దేశమంతా పర్యటించి గరిబి హటావో అనే నినాదంతో ఏవిధంగా ముందుకు వెళ్ళాలి.. అదే తీరున రాహుల్‌గాంధీ దేశమంతా పర్యటించి దేశ సమైక్యతను కాపాడాలని పిలుపునిచ్చారని ఆయన అన్నారు. ఇందిరాగాంధీ సేవలను ప్రజలు ఎన్నటికీ గుర్తుపెట్టుకుంటారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా నూడా చైర్మన్ కేశ వేణు మాట్లాడుతూ.. ఇందిరా గాంధీ సేవలు మరువలేనివి, ప్రపంచ దేశాలకు స్ఫూర్తిగా ఇందిరాగాంధీ ఆలోచన విధానాలు ఉండేవని, దేశం అభివృద్ధి చెందడానికి దశ దిశ చూపిన వ్యక్తి అని ఆమె మరణం దేశాన్ని కలచివేసిందని ఇందిరా గాంధీకి మరొక్కసారి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విక్కీ యాదవ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగం, నగర యూత్ అధ్యక్షులు ప్రీతం, జిల్లా ఫిషర్‌మెన్ అధ్యక్షులు శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆబుడ్ బిన్ హందాన్, కైసర్, రాష్ట్ర ఓబీసీ సెక్రటరీ దాత్రిక భాస్కర్, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సాయిలు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సహకరించండి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు గ్రామస్తులు అందుబాటులో ఉండి సహకరించాలని కమ్మర్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామంలో సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) చేపట్టనున్నట్టు ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ ప్రజలు తమ తమ ఇండ్లలో అందుబాటులో ఉండి ఇంటికి వచ్చే (ఘనకులు) ఎన్యుమరేటర్‌లకు సహకరించాలని విన్నవించారు. ప్రజలు ఎన్యుమరేటర్‌లకు ప్రభుత్వం నిర్దేశించిన సర్వేకు సంబంధించిన పూర్తి వివరాలను పారదర్శకంగా అందించి సహకరించాలని కోరారు.

9న అసువులు బాసిన పోరాటయోధులకు స్మారకసభ

- న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాస్



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

భూమి, భుక్తి, భారతదేశ విముక్తి కోసం తమ ప్రాణాలను త్యాగం చేసి అసువులు బాసిన పోరాట యోధుల స్మారక సభను ఈనెల 9 శనివారం వరకు నిర్వహించాలని రాష్ట్ర కమిటీ పిలుపును పార్టీ శ్రేణులు అమలు చేయాలని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో అసమానతలు, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి తమ అమూల్యమైన జీవితాలను, సామాజిక మార్పు కోసం అర్పించడం హిమాలయాల కన్నా ఉన్నతమని ఆయన కొనియాడారు. తెల్ల దొరలు పోయి నల్ల దొరలు అధికారం చేపట్టిన, శ్రమదోపిడి రూపం మారిందే కానీ, దేశంలోని మెజార్టీ ప్రజలకు అన్యాయం జరుగుతూనే ఉందని ఆయన అన్నారు. దేశంలో సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారులు, భూస్వాములు, దళారి పాలకులు ప్రజలను అనేక రూపాలు మోసగిస్తూ అధికారం చెలాయిస్తున్నారని ఆయన తెలిపారు. ప్రజా సంపద కొల్లగొడుతూ పేదలను ఆకలితో నిరుద్యోగంతో, నిరక్షరాస్యతతో, అసమానలతో వేధిస్తూనే ఉన్నారని ఆయన అన్నారు. 77 ఏళ్ల స్వాతంత్ర్య భారతావనిలో నేటికీ అధిక ధరలు, నిలువ నీడ లేక నిరుపేదలు బాధలు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుల జెండాలు మారినా.. ప్రజల బతుకుల్లో వెలుగు లేదని ఆయన అన్నారు. దోపిడీ పీడల లేని వ్యవస్థ కోసం ఎర్రజెండాను సమున్నతంగా ఎత్తిపట్టుకుని పోరాడిన అమరవీరుల జీవితాలు మనకు ఆదర్శమని తెలిపారు. అన్నారు. జిలాలో కుమార్ నారాయణ, పిట్ల ఎల్లన్న, మంగల్పాడ్ సాయిలు, వేములపల్లి కిరణ్ కుమార్, పర్స గంగాధర్, యస్. సుదర్శన్, అంజక్క, బాజీరావు, రమక్క, పిడిఎస్యు అజయ్, బిల్లాబాగులు, రాములు పోరాటంలో ప్రాణాలు కోల్పోయారని ఆయన తెలిపారు. అమర వీరుల పోరాట స్ఫూర్తితో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నవంబరు 09 వరకు స్మారక సభలను జరపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు సూర్య శివాజీ, ఎల్ఐసి బాలయ్య, ఏఐకేఎంఎస్ ఆర్మూర్ డివిజన్ అధ్యక్షులు మార్క్స్, పిడిఎస్యు డివిజన్ అధ్యక్షులు ప్రిన్స్, ఐఎఫ్టియు వారణారెడ్డి, హుస్సేన్, గంగాధర్ పాల్గొన్నారు.

సమస్యలపై పెన్షనర్ల పోరుబాట

- 5న ధర్నాచౌక్‌లో ధర్నా

నవతెలంగాణ-కంఠేశ్వర్

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 5వ తేదీ (మంగళవారం) నిజామాబాద్ ధర్నా చౌక్‌లో ఉదయం 10 గంటల నుండి (మున్సిపల్ కార్యాలయం పక్కన) ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. శుక్రవారం నగరంలోని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. ప్రధానంగా దేశంలోనే అత్యధిక డీఏలు పెండింగ్‌లో ఉన్న రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఒక డీఏను విదిలించి పెన్షనర్లను నిరాశకు గురిచేసిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం లేని నగదు రహిత వైద్యం అన్ని ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులలో అమలు చేయాలని, కమిటెడ్ వేల్యూ ఆఫ్ పెన్షన్‌ను 12 సంవత్సరాలకు కుదించాలని, ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న వైద్య చికిత్సకు అయిన బిల్లులు, రిటైర్ అయిన ఉద్యోగులకు రావాల్సిన పెన్షనరీ బెనిఫిట్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ధర్నాను చేపడుతున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కే. రామ్మోహన్‌రావు, ఉపాధ్యక్షులు లావు వీరయ్య, కోశాధికారి ఈ.వి.ఎల్. నారాయణ, జిల్లా నాయకులు నర్రా రామారావు, ప్రసాద్, రాధాకిషన్, శిర్ప లింగయ్య, చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, సాగర్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ప్రైవేట్ రంగంలో లాభాల వాటాకై ఏఐటీయూసీ పోరాటం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/ఆర్మూర్

ప్రైవేట్ రంగంలో లాభాల వాటాకై ఏఐటీయూసీ పోరాటం చేస్తుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని టూరిజం హెూటల్ ఆవరణలో, ప్రభుత్వ మెడికల్ కళాశాల, కిషన్‌గంజ్, బోధన్ బస్టాండ్, మున్సిపల్ కార్యాలయం, బోర్గాం బ్రిడ్జి ఆవరణలో ఘనంగా జెండాలను ఆవిష్కరించుకొని, ఏఐటీయుసి మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గురుదాస్ దాస్ గుప్తాకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య మాట్లాడుతూ.. 1920 అక్టోబర్ 31వ తేదీన భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని, ఈ దేశంలో పనిచేస్తున్న కార్మికవర్గానికి హక్కులు ఉండాలనే లక్ష్యంతో ఏర్పడిన ఏఐటీయూసీ సింగరేణి, లాంటి అనేక ప్రభుత్వ రంగ సంస్థల్లో సంస్థకు వచ్చే లాభాలలో కార్మికులకు వాటాలు పంచి ఇచ్చిన ఘనత ఏఐటీయూసీకే దక్కుతుందని అన్నారు. ప్రైవేటు రంగంలో కూడా యాజమాన్యం ప్రతి సంవత్సరం కార్మికులకు లాభాల్లో వాటా పంచటం కోసం ఏఐటీయూసీ పోరాటం చేస్తుందన్నారు. దేశంలో అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం కొంతమంది అంబానీ, ఆదానీ మోదీ లాంటి వ్యక్తుల ఆస్తులు పెంచటానికి పనిచేస్తుందని తెలిపారు. కార్మికుల ఉద్యోగుల శ్రమ ద్వారా వచ్చిన లాభాలను ఉద్యోగ కార్మికులకు పంచడానికి ప్రభుత్వాలు కృషి చేయడం లేదని ఏఐటీయూసీ నాయకత్వంలో ఉద్యోగ కార్మికుని ఐక్యం చేసి పని భద్రత, వేతనాల పెంపుతో పాటు లాభాల్లో వాటాల పంపకానికి భవిష్యత్తులో పోరాటం నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసి జిల్లా అధ్యక్షులు పి.నరసింగరావు, ఉపాధ్యక్షులు టి.చక్రపాణి, జిల్లా కార్యదర్శి పి.హనుమాన్లు, నాయకులు రాజన్న, రాధాకుమార్, సాయి, శ్రీనివాస్, రాములు, అజీజ్, నరసయ్య, చిన్నుబాయ్, వివిధ రంగాల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్ సిటీ : మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య

కార్మికుల హక్కుల కోసం..

ఆర్మూర్ : కార్మికుల హక్కుల కోసం పోరాడే ఘనత ఏఐటీయూసీకే దక్కుతుందని జిల్లా నాయకులు ఆరేపల్లి సాయిలు అన్నారు. ఏఐటీయూసీ ఆవిర్భవించి 105 సంవత్సరాల అవుతుందని ఆవిర్భావ వేడుకలు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం రాకముందే ఎందరో భారతీయులను ఏకం చేసిన చరిత్ర ఏఐటీయూసీకే దక్కుతుందని అన్నారు. నాడు బ్రిటిష్ కాలంలోనే కార్మికుల పక్షాన అనేక పోరాటాలు చేసి 44 కార్మిక చట్టాలను సాధించుకున్నామని తెలిపారు. పెట్టుబడిదారి వ్యవస్థకు వ్యతిరేకంగా కార్మికుల పక్షాన పోరాటాలు చేస్తే.. నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చాక సంపన్నులకు కొమ్ము కాస్తున్నారని తెలిపారు. దేశ ప్రజలను దోచుకుంటున్న అదానీకేమో మొబైల్ రీఛార్జ్ గతంలో రూ.200 ఉండగా కుమారుడి పెళ్లి అనంతరం రూ.350 పెంచిన అదానీ కుటుంబానికి దీపావళి సందర్భంగా కోట్లాది రూపాయలు బ్యాంక్ రుణాలు మాఫీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో ఉచిత బస్ ప్రయాణంతో రోడ్డున పడ్డ ఆటో డ్రైవర్స్‌ను ఆదుకుంటానని హామీఇచ్చిన రేవంత్‌రెడ్డి సర్కార్.. ఇప్పటికీ హామీలను నిలబెట్టుకోకపోవడం అత్యంత బాధకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మౌలానా, నరేష్, శ్రీకాంత్, శ్రీను, బక్కన్న, సుభాష్, సాయన్న, రహీమ్, ఫేరోజ్, మంగ, జమున, రమేష్, బాలయ్య, పరశురామ్, గోవింద్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
శనివారం | నవంబర్ 02, 2024 | www.navatelangana.com

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక



నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని పోతంగల్ కలాన్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అన్వేష్, శ్రావ్య రాష్ట్ర స్థాయి అండర్-17 బాల బాలికల విభాగం లో రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగారావు, పిడి నాగరాజ్ తెలిపారు. నవంబర్ 8 నుంచి 10 వరకు మేడ్చల్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు. స్టాండ్ బై గా సమ్రీన్, ధన్ రాజు కుడా సెలెక్ట్ అయినట్టు తెలిపారు. పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయి పోటీలో ప్రతిభ సాధించిన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

కెనడాలో దీపావళి వేడుకలు


కెనడాలో దీపావళి జరుపుకున్న తెలుగువారు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డ్ లింగాపూర్ గ్రామంలోని డాక్టర్ సాహితి వైద్య కుటుంబ సభ్యులు కెనడా దేశంలోని టొరంటోలోని ఒంటరియాలో శుక్రవారం మహాలక్ష్మీ పూజాలు నిర్వహించి, తెలుగువారు ఒకరికి ఒకరు దీపావళి శుభాకాంక్షలు తెలియచేసుకున్నరు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మనం ఎక్కడున్నా మన సంస్కృతి, సంప్రదాయాలను నిర్వహించకపోవడం మన సంప్రదాయంగా వస్తున్న ఆచారం అన్నారు. ఈ కార్యక్రమంలో దంపతులు సాయితేజ, సాహితి, సుష్మిత్ వైద్య, తదితర తెలుగు వారు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా విక్రయాలు

- అనుమతులు లేకుండా వెలిసిన టపాసుల దుకాణాలు
- చర్యలు తీసుకోకపోవడంతో ప్రతేడాదీ ఇదే తంతు
- నేడు, రేపూ కొనసాగనున్న దుకాణాలు



నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని నిజాంసాగర్, బాన్సువాడ చౌరస్తా ప్రధాన రహదారులపై కొందరు టపాకాయల దుకాణాల పర్మిషన్ లేకుండానే ఏర్పాటు చేశారు. సామాన్య ప్రజలకు నుంచి అందిన కాడికి దోచుకున్నారు. దీపావళి పండగ వేల జనవాసాల్లో, రద్దీ ప్రదేశాలలో టపాసులు విక్రయించొద్దని ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ కొందరు ధనార్జనే ధ్యేయంగా భావించి జనవాసాల్లో (మార్కెట్) సంత ఉన్నప్పటికీ రద్దీ ప్రదేశాలలో టపాకాయల విక్రయిం చారు. టపాసుల దుకాణాలను ఏర్పాటుకు గాను స్థానిక తహసీల్దార్, పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్, గ్రామపంచాయతీ, అగ్నిమాపక కేంద్రం నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాల్సి ఉండగా అదేమీ పట్టనట్లు వ్యవహరించారు.

టపాసుల విక్రయ దుకాణదారులు ఫైర్ సేఫ్టీ నిబంధనలు కచ్చితంగా పాటించాలి. సముదాయం వద్ద నీరుతో పాటు బకెట్లు అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. పొడి ఇసుక కలిగిన బకెట్లను ఏర్పాటు చేసుకోవాలి. అగ్నిని ఆర్పే సాధనాలను ముందస్తు జాగ్రత్తగా ఏర్పాటు చేయాలి. ఇవేమీ పట్టకుండా అందిన కాడికి ప్రజల నుండి భారీగా దోచుకున్నట్లు మండల కేంద్రంలో పుకార్లు జోరందుకున్నాయి. ప్రతి ఏటా కొందరు అక్రమార్కులు ఇదే దందా కొనసాగిస్తూ అధిక డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం మూడు రోజుల పాటు విక్రయాలు జరిగే అవకాశం ఉందని, ఇప్పటికైనా అధికారులు తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

ఒక్క దరఖాస్తూ రాలే
వేణుగోపాల్ తహశీల్దార్



దీపావళి పండుగ కోసం మండల కేంద్రంలో, మరే గ్రామాలనుండి టపాసుల దుకాణాల ఏర్పాటుకు తమకు ఒక్క దరఖాస్తు రాలేదు. అయినప్పటికీ పర్మిషన్ తప్పనిసరిగా తీసుకోవాల్సి వుంటుందని సూచించారు. జరగరానిది ఏదైనా ప్రమాదం జరిగినట్లయితే దుకాణదారులు బాధ్యతవహించాల్సి వుంటుందన్నారు.

నిబంధనల ప్రకారం లేకపోవడంతో పర్మిషన్ ఇవ్వలే
రాజు స్థానిక ఎస్సై



దీపావళి పండుగ వేళ.. మండల కేంద్రంలో టపాసుల దుకాణాల ఏర్పాటుకు 8 మంది వ్యక్తులు పర్మిషన్ ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. కాగా బహిరంగ ప్రదేశాలు కాకుండా జనావాసాల్లో, రద్దీ ప్రదేశంలో టపాసులు విక్రయించేందుకు పర్మిషన్ లేదని తెలిజేశాను. ప్రజలకు ప్రమాదాలు సంభవించే ఆస్కారముటుందని ముందుస్తూ జాగ్రత్తగా ఏ ఒక్క వ్యక్తికీ కూడా పర్మిషన్ ఇవ్వలేదు. పర్మిషన్ లేకుండా ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

జనవాసాలలో టపాకాయ దుకాణాలు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని దీపావళి సందర్భంగా టపాకాయ దుకాణాలు ఎక్కడికక్కడ ఏర్పాటు చేశారు. వ్యాపారం చేస్తున్న ఎవరు కూడా నిబంధనలు పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. టపాకాయలు అమ్మడానికి ప్రత్యేక స్థలాలను ఏర్పాటు చేయవలసిందిగా నిబంధనలకు విరుద్ధంగా జనవాసాలు ఉండే స్థలాలలోనే యదేచ్ఛగా టపాకాయలు అమ్మడం జరిగింది. అనుమతులు తీసుకోవాల్సి ఉండగా ఎటువంటి అనుమతులు లేకుండా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసినట్టు పలువురు ఆరోపిస్తున్నారు. దుకాణాల పక్కనే టపాకాయలను యథేచ్ఛగా కాల్చారు. అలా కాల్చినప్పుడు దుకాణాలపై నిప్పు రవ్వలు పడితే పెద్ద ప్రమాదమే పొంచి ఉందని పలువురు తెలిపారు. టపాసులు దుకాణాలకు విశాలమైన స్థలాలలో ఏర్పాటు చేయాల్సింది ఉండగా అటువంటి ఎలాంటి ఏర్పాట్లు లేకుండానే ఒక వైపు జనవాసాలు మరో వైపు రోడ్డుపై ప్రజలు ప్రయాణాలు చేస్తున్న ప్రాంతంలో ఏర్పాటు చేయడం గమనార్హం.



ఐఎంఏకు రెండు అవార్డులు



అవార్డు అందుకుంటున్న ఐఎంఏ జిల్లా కార్యదర్శి అరవింద్

నవతెలంగాణ-కామారెడ్డి

ఐఎంఏకు మొట్టమొదటిసారిగా రెండు అవార్డులు వచ్చాయని ఐఎంఏ జిల్లా కార్యదర్శి అరవింద్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఐఎంఏ లక్ష్యాలను, ఆలోచనలను ప్రచారం చేయడంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రమణ, కార్యదర్శి అరవింద్ కుమార్‌లు అందించిన సేవల గాను బెస్ట్ సీఎంఈ ప్రోగ్రాం అవార్డును అందించారు. హైదరాబాద్‌లోని కోటిలో గల ఐఎంఏ బిల్డింగ్‌లో డాక్టర్ జీకే కిర్లోస్కర్ హాల్‌లో ఈ అవార్డులను రాష్ట్ర అధ్యక్షులు కాళిదాసుతో కలిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీఏ అధ్యక్షుడు డాక్టర్ కే సతీష్, నేషనల్ ఐఎంఏ అధ్యక్షులు, డాక్టర్ కే బాన్సలి, పూర్వ ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్, ఇ రవీందర్ రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె విజయ రావు, కామారెడ్డి జిల్లా నుంచి అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కోశాధికారి డాక్టర్ పవన్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలోని పోలీస్ కార్యాలయంలో జాతీయ ఐక్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ సర్దార్ వల్లబాయి పటేల్ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో దేశంలో ఐక్యమత్యాన్ని, దేశ సమగ్రత కాపాడుతామని జిల్లా అడిషనల్ ఎస్పీ కే.నరసింహారెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దేశంలోని సంస్థానాలన్నీ ఒక తాటిపై తీసుకువచ్చి ఒక భారతదేశంగా మార్చడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కీలకంగా నిలిచారన్నారు. తోటి వారితో స్నేహపూర్వకంగా, సోదరభావంతో మెలిగితే శాంతిభద్రతల సమస్యలు తలెత్తవని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు నవీన్ కుమార్, సంతోష్ కుమార్, కృష్ణ, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో రాష్ట్రీయ ఏక్తా దివాస్..

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివాస్ కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించినట్లు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఉద్యోగులచే ప్రతిజ్ఞ నిర్వహించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యార్థులకు ఆన్ జాబ్ ట్రైనింగ్

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కామారెడ్డి ఒకేషనల్ విద్యార్థులు శుక్రవారం నుంచి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆన్ జాబ్ ట్రైనింగ్ కొరకు వెళ్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జయకుమారి తెలిపారు. విద్యార్థులందరికీ కళాశాల ప్రిన్సిపల్ ఓజెటీ గురించి, ఆసుపత్రిలో డిసిప్లిన్‌గా ఉండాలని, శిక్షణ తరగతులకు ప్రతిరోజు హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు పద్మ, యోగితా, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని లింగంపల్లి గ్రామ శివారులో గురువారం హత్యకు గురైన వ్యక్తి పిట్ల కృష్ణ అని పోలీసులు తెలిపారు. పోలీసుల వివరణ ప్రకారం డిచ్‌పల్లి మండలం ధర్మారం (బి) గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు ఎస్సై రంజిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. పోలీసులు సంఘటన స్థలం లో పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గోకుల్‌తండాలో గురువారం వరి కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ సదాశివరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సంఘ్య నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు వరి ధాన్యాన్ని విక్రయించి లబ్ధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు లక్ష్మా గౌడ్,ప్రవీణ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మోహన్ నాయక్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సోయాబీన్, వరి కొనుగోల్లు ప్రారంభించాలి

నవతెలంగాణ-గాంధారి

తక్షణమే వడ్ల కొనుగోలు కేంద్రాన్ని, సోయాబీన్ పంటను తక్షణమే కొనుగోలు చేపట్టాలని గాంధారి మండల కిసాన్ సంఘ్ రైతులు డిమాండ్ చేస్తూ తహశీల్దార్ సతీష్ రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కోతలు కోసి నెల రోజులు అయినా ఎక్కడా కొనుగోలు ప్రారంభించలేదని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలి కొనుగోలు యేయాలని డిమాండ్ చేశారు. ప్రతి పంటకు, ప్రతి క్వింటాలుకు 500/- రూపాయల బోనస్ ఇవ్వాలని, వడ్ల బస్తా 40.కి. 650 గ్రాములు మాత్రమే కాంట చేయాలి కాంట అయిన వెంటనే రైతులకు తట్ పట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఘనంగా దీపావళి వేడుకలు

నవతెలంగాణ-పిట్లం/మద్నూర్/సదాశివనగర్

మండల కేంద్రంలోని ఆయా గ్రామాలలో దీపావళి పండగ వేడుకలను గురు, శుక్ర వారాలలో ఘనంగా నిర్వహించారు. హిందువుల పండుగలలో దీపావళి పండగ పవిత్రమైనదిగా విజయానికి నాందిగా ఈ పండగను ప్రజలు కొలుస్తారు. ఈ సందర్భంగా కుటుంబ సమేతంగా దీపావళి పండుగను తీపి వంటకాలతో, ఇంటిలోగిళ్ళలో దీపాకాంతులు వెలిగించి చిన్న పెద్ద తారతమ్యం లేకుండ టపాసులు కాలుస్తూ సందడి చేశారు. కాగా ఆయా దేవాలయాలలో పూజలు నిర్వహించి విజయమునందించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, చిన్నారులు, పాల్గొన్నారు.

దీపావళి వేడుకల్లో ఎమ్మెల్యే

మద్నూర్ : కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు సంతోష్ మేస్త్రి ఇంట్లో గురువారం రాత్రి నిర్వహించిన దీపావళి వేడుకలకు జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీ కాంతారావు హాజరై పూజల్లో పాల్గొంటూ టపాకాయలు కాల్చారు. ఎమ్మెల్యేకు సంతోష్ మేస్త్రి కుటుంబ సమేతంగా శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే వెంటా నాయకులు హనుమాన్లు స్వామి, జావీద్ పటేల్, అమూల్, చిన్న షక్కర్గ దిగంబర్, గడ్డం వార్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం దీపావళి పండుగను ఘనంగా నిర్వహించారు. ఉదయం పూట తీపి వంటలు చేసుకుని భుజించారు సాయంత్రం లక్ష్మీ పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం టపాసులను కాల్చుకున్నారు.

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో పతకం


క్రీడాకారుడిని సన్మానించిన పలువురు

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న ఏ.నవీన్ రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభ చాటినట్టు కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ తెలిపారు. అధ్యాపకుల ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థిని ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తేజస్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ కళాశాల గేమ్ ఫెడరేషన్ అండర్ 19 అర్చరీ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని రజత పతకం సాధించారని తెలిపారు. భవిష్యత్తులో ఇదే స్థాయిలో రాణించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. చదువుతో క్రీడల్లో కూడా విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తున్నామని, ఉద్యోగాల్లో, విద్య సంస్థల్లో స్పోర్ట్స్ కోట కింద రిజర్వేషన్లు వర్తిస్తాయిని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి


మృతి చెందిన వెంకటి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు మురికి కాలువలో పడి వ్యక్తి మృతి చెందారు. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో స్థానిక ప్రజలు చూసి పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని మృతి దేహాన్ని బయటకు తీయించారు. బోర్లాం గ్రామానికి చెందిన నాందేడం వెంకటి (48)గా గుర్తించారు. మృతుదేహన్నీ పోస్టుమార్టం కోసం బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మండల కేంద్రంలోని వైన్ షాప్ సమీపంలో ఉన్న బ్రిడ్జ్ పక్కన మురికి కాలువలో పడి మృతి చెందాడని పోలీసులు గుర్తించారు. పెద్ద కొడప్ గల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో వంట పని చేస్తాడని తెలిసింది. భార్య కోటవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే సురేందర్

నవతెలంగాణ-సదాశివనగర్

ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే సురేందర్ అన్నారు. సదాశివనగర్ మండల అడ్లూర్ ఎల్లారెడ్డి ఎంపీటీసీ నర్సింలు సోదరి లింగంపేట్ మండల ఐలపూర్ గ్రామానికి చెందిన దుద్దే సవిత గారికి ఆరోగ్య సమస్యతో హైదరాబాద్‌లోని రాఘవేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సమాచారం అందిన వెంటనే గురువారం ఆసుపత్రికి వెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితిని మాజీ ఎమ్మెల్యే తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం కిమ్స్ ఆసుపత్రిలో డాక్టర్లతో మాట్లాడి అక్కడికి వెళ్లాల్సిందిగా సూచించారు. పేషెంట్ కుటుంబ సభ్యులకు అండగా తానున్నానని, ఆమె తొందరగానే కోలుకుంటారని మనోధైర్యం ఇచ్చారు.

బ్లడ్‌టెస్ట్ చేయకుండానే రిపోర్ట్


రిపోర్ట్‌ను చూపిస్తున్న కుటుంబ సభ్యుడు

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)

గత కొన్ని రోజులుగా ఆరోగ్యం బాగాలేదని ఆస్పత్రికి వస్తే పరీక్షలు నిర్వహించకుండానే, రక్త పరీక్ష కోసం రక్తం తీసుకోకుండానే రక్త పరీక్ష చేసినట్లు రిపోర్టులు, మందులు ఇస్తున్న వైనం వెలుగుజూసింది. బాన్సువాడ ఏరియా ఆసుపత్రిలో రెండు రోజుల క్రితం పిట్లం మండలం మద్దెల చెరువు గ్రామానికి చెందిన గైని రామవ్వ ఆరోగ్యం బాగాలేదని ఆసుపత్రికి వస్తే ఆరోగ్య పరీక్షలు, రక్త పరీక్షలు చేయకుండానే మందులు, రక్త పరీక్ష చేసినట్లు రిపోర్టులు ఇచ్చారంటూ రోగి బంధువులు ఆందోళన దిగారు. గైని రామవ్వకు పేషెంట్‌కు బ్లడ్ తీసుకోక ముందే బ్లడ్ రిపోర్ట్ ఇచ్చారని సరైన ట్రీట్మెంట్ ఇవ్వట్లేదని ఆస్పత్రికి వచ్చిన రోగుల కుటుంబ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఎలాంటి మందులు ఇవ్వట్లేదు బయట నుంచే కొని తీసుకొస్తున్నట్టు తెలిపారు. రక్త పరీక్షలు కూడా బయటనే చేయించామని గైని రామవ్వ కొడుకు తెలిపాడు.

దీనిపై ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. బ్లడ్ పరీక్షలు చేయకుండానే రిపోర్టు ఇచ్చి కొద్దిసేపు తర్వాత రిపోర్టులు లాక్కున్నారని, దీనిపై ఉన్నత అధికారులు విచారణ జరిపి ఆస్పత్రి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమగ్ర కుటుంబ సర్వే దరఖాస్తులు పంపిణీ



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

శుక్రవారం నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో పాటు ఆయా గ్రామాల్లో ప్రారంభమైన సమగ్ర కుటుంబ సర్వే దరఖాస్తు ఫారాలను శుక్రవారం రోజు ఎంపీడీవో ప్రభాకర్ చారి ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు పంపిణీ చేశారు. దరఖాస్తు ఫారాల తో పాటు స్టిక్కర్లను ఆయన వారికి అందించారు. గ్రామాలలో శుక్రవారం రోజు సర్వేను ప్రారంభించినట్లు ఎంపీడీవో ప్రభాకర్ చారి తెలిపారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

ఏఐటియుసి 105 ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ముందు జెండాను రాష్ట్ర సీనియర్ నాయకులు, న్యాయవాది, విఎల్ నరసింహారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1920 అక్టోబర్ 31 తేదీన ముంబై మహానగరంలో ఏఐటీయూసీ స్థాపించబడిందని తెలిపారు. వందేళ్లుగా సుదీర్ఘంగా కార్మికుల పక్షాన ఏఐటీయూసీ చేపట్టిన పోరాటాలు ఉద్యమాలలో అనేక హక్కులను సాధించుకోవడం జరిగిందన్నారు. కార్మిక స్వాతంత్రం కోసం పోరాటలు సాగిన చరిత్ర ఏఐటియుసికి మాత్రమే ఉందని ఎన్నో పోరాటాల ఫలితంగా కార్మిక చట్టాలు సాధించుకుని కార్మికుల స్వేచ్ఛను అనుభవిస్తుంటే, ఈ బిజెపి ప్రభుత్వం 44 చట్టాలను నాలుగు కోడ్లుగా చేసి కార్మిక హక్కులను హరించిందన్నారు.

కార్మిక చట్టాలను అంబానీ, ఆదాలకు, కార్పొరేట్ సంస్థలకు అనుకూల విధంగా పనిచేస్తున్నాయని, బ్యాంకింగ్, రైల్వే, విమానం రావణ, ఎల్ఐసి, రహదారులు అనేక మధ్యతరగతి కుటుంబాలకు నిరుపేద కుటుంబాలకు అందకుండా ప్రైవేట్ వ్యవస్థలో పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పి.బాలరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.దశరథ్, మున్సిపల్ జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణ్, మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తండ్రిని చంపిన తనయుడు


మృతి చెందిన కర్రె సాయబోయి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

మద్యం మత్తులో జులాయిగా తిరుగుతూ కన్నతండ్రిని అతి కిరాతకంగా కొడుకు హత్య చేసిన ఘటన బాన్సువాడ డివిజన్ పరిధిలోని నసురుల్లాబాద్ మండలం నెమ్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నేమ్లి గ్రామానికి చెందిన కర్రే హన్మాండ్లు చెడు వ్యసనాలతో పాటు మద్యానికి బానిసై ఎలాంటి బాధ్యత లేకుండా పని చేయకుండా గ్రామంలో జులాయిగా తిరుగుతుండేవాడు. గురువారం రాత్రి కొడుకు హన్మాండ్లును తండ్రి కర్రె సాయ బోయి(70) మద్యం మానాలని, బాధ్యతగా పని చేసుకోవాలని మందలించాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న హన్మాండ్లు తన తండ్రి తలపై కర్రతో కొట్టి హత్య చేశాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న బాన్సువాడ సర్కిల్ ఇన్స్పెక్టర్, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బైకులో పెట్రోల్‌కు బదులు డీజిల్

- తనిఖీలు చేయని అధికారులు


బైక్ నుంచి డీజిల్ తీస్తున్న బంక్ సిబ్బంది

నవతెలంగాణ-కామారెడ్డి

పలు పెట్రోల్ బంక్ నిర్వహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పెట్రోల్‌కు బదులు డీజిల్ పోస్తున్నట్లు వినియోగదారులు వాపోతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్డు ధర్మ కాంట పక్కనగల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ బదులు డీజిల్ పోసి బైకులను కరాబ్ చేస్తున్నారు. తూనికాల కొలతల అధికారులు తనఖీలు లేకపోవడం ద్వారానే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. కస్టమర్లకు పెట్రోల్ బదులు డీజిల్ పోసి మళ్లీ తీసేస్తామని చెప్పి, గంటల తరబడి పెట్రోల్ బంకులోనే ఉంచుతున్నారు. దీనిపై పెట్రోల్ బంక్ మేనేజర్ పర్వతం రమణను వివరణ కోరగా కావాలని అలా చేస్తారా అని బదులు చెప్తున్నారు. దీనిపైన వెంటనే అధికారులు స్పందించి బంకును సీజ్ చేయాలని కస్టమర్లు కోరుతున్నారు.

3న చలో కామారెడ్డి

నవతెలంగాణ-మద్నూర్

ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తూ మాదిగలకు ద్రోహం చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మీద పోరాటానికి సిద్ధం కావడానికై, మాదిగల ధర్మ యుద్ధ మహాసభ 3న చలో కామారెడ్డి కార్యక్రమం విజయవంతం కొరకు మాదిగలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రతినిధి గోజేగావ్ విజయ్ శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ పిలుపు నిచ్చారు.

రోగులకు పండ్లు పంపిణీ

- మాజీ ఎంపీ జన్మదినం సందర్భంగా

నవతెలంగాణ-మద్నూర్

జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తెప్పవార్ తుకరం, జిల్లా సెక్రెటరీ కృష్ణ పటేల్, ఓబీసీ జుక్కల్ కన్వీనర్ తులవార్ సంతోష్, సొసైటీ డైరెక్టర్ బాలకిషన్, ప్రవీణ్, అంజన్న, శివాజీ, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

థ్యాంక్యూ సీఎం సార్

• డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపుపట్ల బీసీ గురుకుల పాఠశాల విద్యార్థుల హర్షం

నవతెలంగాణ-వర్ని

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచిన నేపథ్యంలో మండలంలోని పాత వర్ని గ్రామంలో జ్యోతి బాపూలే బీసీ గురుకుల విద్యార్థులు ఫ్లకార్డులు చేత పట్టుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ధన్యవాదాలు తెలిపారు.



ప్లకార్డులతో ధన్యవాదాలు తెలుపుతున్న విద్యార్థులు

అవార్డు అందుకున్న ఐఎంఏ సెక్రెటరీ

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ రాష్ట్ర వార్షిక అవార్డు ప్రదాన కార్యక్రమంలో భాగంగా ఐఎంఏ బ్రాంచి సెక్రటరీ డా.భాను రామగిరి అవార్డును ఇటీవల అందుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ బాలు మాట్లాడుతూ.. నేషనల్ ఐఎంఏ ప్రెసిడెంట్ డా.దిలీప్ భానుశాలి, తెలంగాణ రాష్ట్ర ఐఎంఏ ప్రెసిడెంట్ డా.కాళిప్రసాద్ చేతుల మీదుగా అందుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుంచి ప్రముఖ వైద్యులు పాల్గొన్నట్టు తెలిపారు. ఆర్మూర్ బ్రాంచ్‌కి దక్కిన గౌరవానికి పలువురు వైద్యులు ఐఎంఏ అధ్యక్షులు రిషిత్ హాస్పిటల్ వైద్యులు వెంకట్‌గౌడ్, ఆశ హాస్పిటల్ వైద్యులు చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న భాను రామగిరి

ఇందిరమ్మ కమిటీలతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

• అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కాంగ్రెస్ ప్రభుత్వం దీపావళి కానుకగా ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ చేపడతామని ఇందిరమ్మ కమిటీలతో నిజమైన అర్హులైన గరిబోళ్ళను మోసం చేస్తుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల అధికారంలో ఉండి తెలంగాణలో ముఖ్యంగా నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ఒక్క ఇళ్లు కూడా ఇవ్వలేదని తెలిపారు. డబుల్ బెడ్ రూమ్‌ల పేరుతో ప్రజలను మోసం చేసి కాంట్రాక్టర్ల దగ్గర కమీషన్లకు తెర తెలిపిందని అన్నారు. మార్పు కావాలని కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు చూసి కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెడితే అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఒక్కటి కూడా దిక్కు లేదని ఇప్పుడు తెలంగాణలో నిజమైన అర్హులైన వారికీ కాకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఇళ్లు పంచే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం తెరలేపడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇందిరమ్మ ఇండ్ల జాబితా ప్రజాక్షేత్రంలో నిజమైన అర్హులను ఎంపిక చేయాలని నియోజకవర్గానికి కాంగ్రెస్ ఇస్తానన్న 3500 ఇళ్లతో పాటు డబుల్ బెడ్ రూమ్‌లను కూడా అర్హులైన వారికి కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అర్హులందరితో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

7న జాతీయ సెమినార్‌ను జయప్రదం చేయండి

• ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి కర్రోళ్ల శ్రీనివాస్



గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంసిపిఐ(యం) నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (ఐక్య) - (ఎంసిపిఐయు) రివల్యూషనరి మార్క్సిస్టు పార్టీ ఆఫ్ ఇండియా-(ఆర్ఎంపిఐ) ఆధ్వర్యంలో ఏర్పడ్డ కమ్యూనిస్టు కో-ఆర్డినేషన్ కమిటీ (సిసిసి) సమావేశాలను నవంబర్ 5,6,7న హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో విప్లవ వార్షికోత్సవం సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాదులో, "ప్రస్తుత రాజకీయ పరిస్థితులు-మతోన్మాద కార్పోరేట్ శక్తుల ప్రమాదం-వామపక్ష కమ్యూనిస్టు శక్తుల కర్తవ్యం" అనే అంశంపై నిర్వహించే జాతీయ సెమినార్‌ను జయప్రదం చేయాలని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కర్రోళ్ల శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. శుక్రవారం నగరంలోని ఎంసిపిఐయు పార్టీ ఆఫీసులో జాతీయ సెమినార్ గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ కర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశంలో కమ్యూనిస్టు పార్టీలు ఐక్యంగా లేకపోవటం వలన దేశ ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో తీవ్ర అణిచివేతకు గురై పేదరికం, నిరుద్యోగం, అసమానతలు తీవ్రంగా పెరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ఇందుకు దీనికి ప్రజా పక్ష పార్టీలు అయిన కమ్యూనిస్టు పార్టీలు తగిన ఐక్య కార్యాచరణతో ముందుకు వెళ్లేందుకు అక్టోబర్ విప్లవ వార్షికోత్సవ స్ఫూర్తితో నవంబర్ 7న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే సెమినార్‌కు వామపక్ష మేధావులు, విద్యావంతులు, ప్రజాతంత్ర వాదులు, యువత, విద్యార్థి, కార్మికులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌డిఎస్ జాతీయ కన్వీనర్ మేత్రి రాజశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేతరీ రవి, జిల్లా కమిటీ సభ్యులు తాటిపల్లి అంజయ్య, బంగారుగల్లా కిరణ్, మహిళ నాయకురాళ్లు కామ్రేడ్ ఉషాబాయి, శారదా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన డిపో 1 మేనేజర్



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన దిలీప్‌కుమార్‌ను నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఆర్టీసీ డిపో 1 మేనేజర్ బిఎస్ ఆనంద్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

అరకొర వేతనాలతో వెట్టి చాకిరీ..?

• ఆవేదన వ్యక్తం చేస్తున్న ఆర్పీలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మహిళా సంఘాల సభ్యులకు తమ వంతు సేవ చేయాలని ఉద్యోగంలో చేరితే తమకు నెలకు రూ.6 వేల వేతనం మాత్రమే ఇస్తూ.. తమతో ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయిస్తోందని నగర ఆర్పీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అన్ని రకాల సర్వేలను తమతోనే చేయిస్తూ శ్రమను దోచుకొంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం చేపడుతున్న కులగణన సర్వేలోనూ తమ వార్డులు కాకుండానే ఇతర వార్డులకు కేటాయిస్తే ఎలా పని చేయాలని అధికారుల తీరుపై ఆర్పీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఓ సమావేశంలో పాల్గొన్న ఆర్పీలు(ఫైల్)

ఏటీసీ నిర్మాణ పనులను పూర్తి చేయాలి

• కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

• ఏటీసీ నిర్మాణ పనుల పరిశీలన

నవతెలంగాణ-బోధన్

జిల్లాలోని వివిధ ప్రాంతాలలో కొనసాగుతున్న అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్స్ (ఏటీసీ) నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేయించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం పట్టణ శివారులో నూతనంగా నిర్మిస్తున్న ఏటీసీ భవన సముదాయం నిర్మాణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు కేవలం బేస్ లెవెల్ వరకే నిర్మాణం పనులు జరగడాన్ని గమనించిన కలెక్టర్, పనుల్లో జాప్యంపై అధికారులను ప్రశ్నించారు. వర్షపు నీరు నిలిచి ఉండడంతో పనులు చేపట్టలేకపోయామని, ఇకపై వేగంగా పనులు చేపట్టి వచ్చే ఫిబ్రవరి నాటికి పూర్తి చేస్తామని కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఐటీసీలలో తరగతులు నేటి నుంచి ప్రారంభమైనందున భవన నిర్మాణ పనులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా, సొంత భవనాలు అందుబాటులోకి వచ్చేలోపు ప్రత్యామ్నాయంగా ఐటీఐలలో ఏటీసీ తరగతులను నిర్వహించాలని అధికారులకు సూచించారు. అభ్యర్థులకు శిక్షణ కోసం కేటాయించబడిన యంత్ర సామగ్రి, ఇతర మెటీరియల్ పూర్తి స్థాయిలో వినియోగం అయ్యేలా చూడాలన్నారు. నాణ్యతతో యుద్ధప్రాతిపదికన భవన నిర్మాణ పనులు జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ వికాస్ మహతో, తహసీల్దార్ విఠల్, వైస్ ప్రిన్సిపాల్ సరోజినీదేవి తదితరులున్నారు.



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

• స్త్రీ శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

నవతెలంగాణ-బోధన్

మహిళలు అన్ని రంగాలలో ముందుకు సాగుతూ ఆర్థికంగా బలోపేతం కావాలని మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తాలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్త్రీ శక్తి క్యాంటీన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం మహిళల సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. మహిళలు ఐక్యతగా పనిచేసుకుంటూ వ్యాపారంలో ముందుకు సాగాలని, వారిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. స్త్రీ శక్తి క్యాంటీన్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటనారాయణ, కౌన్సిలర్లు తూమ శరత్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, న్యాయవాది ఇంద్ర కరణ్, నాయకులు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

• మండల ప్రత్యేకాధికారి వాజీద్ హుస్సేన్

నవతెలంగాణ-రెంజల్

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను మండలంలో పకడ్బందీగా నిర్వహించనున్నట్టు మండల ప్రత్యేక అధికారి వాజిద్ హుస్సేన్ స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల స్థాయి గ్రామ కార్యదర్శులు, అంగన్వాడీ, ఆశలు, ఐకెపి సిబ్బందికి కుటుంబ సర్వే రూపకల్పన ప్రక్రియను ప్రారంభించారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు శ్రీకారం చుట్టాలన్నారు. మండల కేంద్రంలో ఇండ్ల జాబితా రూపకల్పన కోసం చేపడుతున్న చర్యలు, పాటిస్తున్న పద్ధతుల గురించి అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించి, ఇంటి తలుపుపై స్టిక్కర్లు వారు గమనించారు. ఒక్కొక్క ఎన్యుమరేటర్ 175 ఇండ్ల చొప్పున కేటాయించి నేటి నుంచి మూడు రోజుల వరకు ఇండ్లను సర్వే చేయాలని వారు సూచించారు. అనంతరం నవంబర్ 6 నుంచి 19 వరకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పూర్తి చేయాలని తెలిపారు. సర్వే పూర్తి అయిన అనంతరం కంప్యూటర్లో వాటిని నమోదు చేయనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎంపీఓ రఫీ హైమద్, ఏఎస్ఓ సాయికుమార్, ఏపీఎం చిన్నయ్య, ఉపాధ్యాయులు సోమలింగం గౌడ్, కిషోర్ కుమార్, ఆనంద్, గ్రామ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఐకెపి సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి

ప్రజలు అందుబాటులో ఉండి సహకరించాలి

• ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్

• కుటుంబాల గుర్తింపు సర్వే పరిశీలన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ప్రజలకు అందుబాటులో ఉండి సహకరించాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాజరాజేశ్వరినగర్, నాగాపూర్, ఉప్లూర్, కొనసముందర్, అమీర్‌నగర్, నర్సాపూర్, చౌట్‌పల్లి గ్రామాల్లో కుటుంబాలకు గుర్తింపు సర్వేను ఎంపీడీవో, తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మండలంలో సుమారు 12వేల కుటుంబాలు ఉన్నట్లు తెలిపారు. గ్రామాల్లో సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ, కుల సర్వే(సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) నిర్వహణ కోసం మండలాన్ని 72 బ్లాక్‌లుగా గుర్తించి, ఎన్యుమరేటర్లను నియమించినట్టు తెలిపారు. సర్వేను పర్యవేక్షించేందుకు మండలంలో ఆరుగురు సూపర్‌వైజర్‌లను కూడా నియమించినట్టు వివరించారు. నేటి నుంచి మూడు రోజులపాటు గ్రామాల్లో కుటుంబాల గుర్తింపు కోసం ఎన్యుమరేటర్లు సర్వే నిర్వహిస్తున్నారన్నారు. గుర్తించిన కుటుంబ యజమాని పేరుతో గోడ ప్రతిని అతికించడం జరుగుతుందన్నారు. ఈనెల 6 నుంచి గుర్తించిన కుటుంబాల వ్యక్తిగత వివరాల నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజలు తమ ఇండ్లలో అందుబాటులో ఉండి ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్‌లకు పూర్తి వివరాలు అందజేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శరత్, ఐకెపి ఎపిఎం కుంట గంగాధర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో

నాణ్యతా ప్రమాణాలు పాటించి మద్దతుధర పొందాలి

• పీఏసీఎస్ అధ్యక్షులు పెద్దకాపుల శ్రీనివాస్‌రెడ్డి



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షులు

నవతెలంగాణ-ఏర్గట్ల

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యత ప్రమాణాలు పాటించి, వరికి మద్దతుధర పొందాలని సంఘం అధ్యక్షులు పెద్దకాపుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాళ్ల రాంపూర్ పీఏసీఎస్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రేడ్ 'ఏ'కు క్వింటాలుకు రూ.2320, గ్రేడ్ 'బి'కి రూ.2300 ఉందని తెలిపారు. ఇందులో భాగంగా ఏఎంసీ కమ్మర్‌పల్లి డైరెక్టర్ కొరిపెల్లి లింగారెడ్డి, మండల వ్యవసాయాధికారి హరీష్, ఏర్గట్ల పీఏసీఎస్ చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య, సంఘ డైరెక్టర్లు సోమ దేవరెడ్డి, దేశబోయిన సంజీవ్, బద్దం రవీందర్, ఏర్గట్ల ఎన్డీసీసీబి మేనేజర్ దేవేందర్, ఏఈఓ సాయి సచిన్, రైతులు, పాల్గొన్నారు.

దేవి ఆలయ నిర్మాణానికి హైదరాబాద్ వ్యాపారుల విరాళం



విరాళం అందజేస్తున్న వ్యాపార వేత్తలు

నవతెలంగాణ-ముప్కాల్

హైదరాబాద్ పట్టణ కేంద్రానికి చెందిన వ్యాపార వేత్తలు దేవిగుడి ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేశారు. వ్యాపార వేత్తలైన ఏ.రాహుల్ రూ.1,00,011, సైనోప్సిస్ ఫార్మా సంస్థ ప్రతినిధి రూ.1,00,000, నిశిత పవర్స్ కంపెనీ లిమిటెడ్ రూ.1,00,000, ఈడీడబ్ల్యూ ఇన్ఫ్రా ఉద్యోగస్తులు గోవర్ధన్ రూ.1,00,000 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు శుక్రవారం అందజేశారు. హైదరాబాద్ వాస్తవ్యులకు దేవి ఆలయం గురించి వివరించి విరాళం అందేలా ప్రత్యేక చొరవ తీసుకున్న మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త నిషిత గ్రూప్ ఇండస్ట్రీ చైర్మన్ నాయకుడు సంతోష్‌కు గ్రామస్తులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంచు విజయ్, టి.సాయన్న, గద్దల గంగారాం, కంచు గంగాధర్, సంజీవ్ థామస్, తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గుండ్ల కాలనీలో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్సై ఈ.సాయన్న తెలిపారు. దీపావళి పండుగను పురస్కరించుకొని పేకాటాడుతున్నట్టు నమ్మదగిన సమాచారం మేరకు తన సిబ్బందితో వెళ్లి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్టు ఆయన పేర్కొన్నారు. వారి వద్ద లభించిన రూ.3200 నగదు, వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు



కమ్మర్‌పల్లి : వేడుకల్లో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/రెంజల్

మండలంలోని ఆయా గ్రామాల్లో దీపావళి పండుగ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. అన్ని గ్రామాల్లో ప్రజలు వ్యాపారస్తులు ఆనందోత్సవాల మధ్య దీపావళి వేడుకలు చేపట్టారు. ఇంటి వాకిళ్లలో అందమైన రంగురంగుల ముగ్గులు వేసి దీపాలను పెట్టారు. దీపావళి పురస్కరించుకొని ఇండ్లను, దుకాణాల సముదాయాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. హైదరాబాద్‌లోని తన స్వగృహంలో రాష్ట్ర మాజీ మంత్రి, బాల్కొండ వేముల ప్రశాంత్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి సంబరాలను జరుపుకున్నారు. కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు.



రెంజల్‌లో..

రెంజల్: మండలంలో దీపావళి పండుగ వేడుకలను మండల వాసులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవికి ప్రత్యేక నైవేద్యాలను సమర్పించి పూజలు చేశారు.

న్యూ ఎన్జీవోఎస్ కాలనీలో చోరీ

• 23 తులాల బంగారం, 8 తులాల వెండి ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని దుండగులు

నవతెలంగాణ-కంఠేశ్వర్



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో గల న్యూ ఎన్జీవోఎస్ కాలనీలో గుర్తుతెలియని దుండగులు తాళం వేసిన ఇంటి తాళం పగలగొట్టి 23 తులాల బంగారం, 8 తులాల వెండి ఎత్తుకెళ్లినట్లు మూడవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహేష్ శుక్రవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. న్యూఎన్జీవోస్ కాలనీకి చెందిన సముద్రాల ఏల్లేశ్వరరావు, అతని కుటుంబ సభ్యులు కలిసి దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ నెలలో 28వ తేదీన వారి సొంత ఊరు అయిన ఖమ్మం జిల్లాకు వెళ్లారు. తిరిగి నవంబర్ 1న సాయంత్రం ఐదు గంటలకు ఇంటికి చేరుకున్నారు. ఇల్లు తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించారు. వెంటనే ఇంట్లోకి వెళ్లి బీరువా పరిశీలించగా.. అందులో నుంచి దాదాపుగా 23 తులాల బంగారు ఆభరణాలు, ఎనిమిది తులాల వెండిని ఎవరో గుర్తు తెలియని దుండగులు దొంగలించుకుపోయారు. బాధితులు ఎల్లేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఘటనా స్థలాన్ని మూడవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహేష్‌తో పాటు నగర సిఐ శ్రీనివాస్‌రాజు పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి క్లూస్‌ను సేకరించారు. దొంగతనం జరిగిన ఇల్లు ఓ జడ్జిదని స్థానికులు తెలుపుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-మెండోరా

మండల కేంద్రానికి చెందిన సాకలి కొండూరు చిన్న గంగాధర్ కాకతీయ కాలువలో గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్‌రెడ్డి ఆర్థిక సహాయం చేయడంతో కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు రూ.5000 ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థులు హర్షం వ్యక్తం

నవతెలంగాణ-మెపాల్

మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు 40 శాతం అదనంగా పెంచినందుకుగానూ మహాత్మా జ్యోతి బాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల కంజర్ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆనందంతో సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో కంజర బీసీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు 'ఆన్ ది జాబ్' ట్రైనింగ్


మాట్లాడుతున్న ప్రధానాచార్యులు జయపాల్‌రెడ్డి

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆన్ ది జాబ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను కళాశాల ప్రధానాచార్యులు జయపాల్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కళాశాల ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థిని విద్యార్థులు నేటి నుంచి డిసెంబర్ 31వరకు రెండు నెలల క్షేత్రస్థాయి పర్యటనకు వెళుతున్నట్లుగా తెలియజేశారు. ఇందులో విద్యార్థులు ఆయా సంస్థలలో అకౌంట్స్, ఆఫీసనందు పనిచేయు విధానం, అలాగే ఫిషరీస్ విద్యార్థులు వాటి విత్తనోత్పత్తి, పెంపకానికి సంబంధించి తెలుసుకుంటారని పేర్కొన్నారు. ఇందులో ఏ అండ్ టి ఆఫీస్ అసిస్టెంట్ షిప్, ఫిషరీస్ ఒకేషనల్ విద్యార్థులతో పాటు అధ్యాపకులు రామచంద్రం, శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి, క్రాంతి కృష్ణ, శోభారాణి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో పెట్రోల్‌తో వ్యక్తి హల్‌చల్



నవతెలంగాణ-బోధన్

భార్యతో గొడవపడి ఓ వ్యక్తి పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఒంటిపై పెట్రోల్ పోసుకుని హల్‌చల్ చేసిన ఘటన కలకలం రేపింది. గురువారం బోధన్ పట్టణ పోలీసు స్టేషన్‌లో బెల్లాల్‌కు చెందిన రాజు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. బెల్లాల్ గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి పోలీస్ స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకున్నాడు. రాజు అతని భార్య మధ్య వివాదం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. రాజు భార్య సావిత్రి మధ్య గొడవలు తలెత్తడంతో ఆమె బంధువు వద్ద ఓ రోజు ఉంది. ఈ విషయం తెలిసిన రాజు బంధువుతో గొడవకు దిగాడు. రోడ్డు పై గొడవ వద్దని మధ్యవర్తిగా వచ్చిన వ్యక్తిపై రాజు దాడికి దిగాడు. అందరు పోలీస్‌స్టేషన్‌కు రావడంతో రాజు ఆగ్రహంతో పెట్రోల్ తలపై పోసుకోవడంతో పాటు అతని భార్యపై సైతం పెట్రోలు పోశాడు. పోలీసులు రాజును అదుపులోకి తీసుకున్నారు.

12, 13 తేదీల్లో బాలోత్సవం

- స్టీరింగ్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ రవీంద్రనాథ్ సూరి, ప్రధాన కార్యదర్శి నర్రా రామారావు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈనెల 12, 13వ తేదీల్లో జన విజ్ఞాన వేదిక, మల్లు స్వరాజ్యం ట్రస్ట్, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో బాలోత్సవాన్ని మోపాల్‌లోని ప్రెసిడెన్సి స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు స్టీరింగ్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ రవీంద్రనాథ్ సూరి, ప్రధాన కార్యదర్శి నర్రా రామారావు తెలిపారు. శుక్రవారం ప్రెస్సిడెన్సి స్కూల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా బాలోత్సవంలో నిర్వహించే వివిధ రకాల అంశాలను రివ్యూ చేశారు. నిజామాబాద్ బాలోత్సవం పేరుతో ఒక వెబ్‌సైట్‌ను సైతం ఆవిష్కరించారు. ఈ వెబ్‌సైట్‌లో నిజామాబాద్ పూర్వ నాలుగు మండలాల ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు బాలోత్సవానికి పంపించే విద్యార్థుల వివరాలను అందులో పొందు పరచవచ్చని స్టీరింగ్ కమిటీ సభ్యులు సూచించారు. ప్రతిరోజు సుమారు 2000 మంది విద్యార్థిని విద్యార్థులు ఈ ఉత్సవాలలో పాల్గొంటారని తెలిపారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి భాగస్వామ్యపు ధ్రువపత్రం, గెలిచిన వారికి మెరిట్ సర్టిఫికెట్, మెమెంటోస్ అందజేయనున్నట్టు వివరించారు. అలాగే ఉచితంగా బ్లడ్ గ్రూపు చేసి వారికి ఐడి కార్డు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇంట్లో ఎవరికైనా గుండెపోటు వస్తే సిపిఆర్ ఎలా చేయాలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. మొదటిరోజు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా, రెండవ రోజు ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి ముఖ్యఅతిథిగా రానున్నట్టు పేర్కొన్నారు. https://nizamabad-balothsavam.info వెబ్‌సైట్‌లో నవంబర్ 7 వరకు విద్యార్థుల తమ పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. పోటీల వివరాలు మొత్తం కూడా వెబ్సైట్లో ఉంటాయని, పాఠశాల యాజమాన్యం వెబ్ సైట్‌లో సైన్ అప్ చేసి పాస్వర్డ్ క్రియేట్ చేసుకుని వారి పిల్లల పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సందేహాలుంటే 9866299828, 8886882236, 9985040928 నెంబర్లకు ఫోన్ చేసి సమస్యలు నివృత్తి చేసుకోవచ్చునని తెలిపారు. నిజామాబాద్ పాత మండల పరిధిలోని దాదాపు 200 ప్రైవేటు, ప్రభుత్వ స్కూల్స్ నుంచి విద్యార్థిని విద్యార్థులు వివిధ పోటీలలో పాల్గొనేందుకు హాజరుకానున్నారని వారు తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ జయసీ నెహ్రూ, కోయడి నరసింహులు, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌రావు, ఈవీఎల్ నారాయణ, నరేందర్, సుధాకర్, విగ్నేష్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న స్టీరింగ్ కమిటీ సభ్యులు

మున్సిపల్ కమిషనర్‌కు వీడ్కోలు సన్మానం


కమిషనర్‌ను సన్మానిస్తున్న కౌన్సిలర్లు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపాల్ కమిషనర్‌గా పనిచేసిన సుజాతా బదిలీపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మున్సిపాలిటీకి వెళ్తున్న సందర్భాంగా శుక్రవారం కమిషనర్‌కు కామారెడ్డి బీఆర్ఎస్ కౌన్సిలర్లు వీడ్కోలు పలుకుతూ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి మున్సిపల్ బీ ఆర్ ఎస్ పార్టీ కౌన్సిలర్లు హఫీజ్ బేగ్, నజీరోద్దీన్, పిట్ల వేణుగోపాల్, గెరిగంటి స్వప్న లక్ష్మినారాయణ తదితరులున్నారు.


సీసీ రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నారాగౌడ్

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో సీసీ రోడ్డు పనులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ ప్రారంభించారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు లింగంపేట్ గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద రోడ్డు లేక ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి శాశ్వత పరిష్కారం కొరకు బ్రిడ్జికి ఇరువైపులా సిసి రోడ్ వేయాలని అందుకు నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ మండల కాంగ్రెస్ నాయకులు వంజరి ఎల్లమ్మయ్య దురిశెట్టి అశోక్ డాక్టర్ విట్టల్ రఫీకోద్దీన్ రవి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజు పట్టణ అధ్యక్షులు ప్రసాద్ గౌడ్ సోషల్ మీడియా కో కన్వీనర్ నగేష్ సంగమేశ్వర్ కిరణ్ కుద్దూస్ రాము తదితరులున్నారు.

అపరిశుభ్రం.. భగీరథ ట్యాంక్


ట్యాంకు అపరిశుభ్రతతో మంచినీటిలో సురగ

నవతెలంగాణ- నిజాంసాగర్

మండలంలోని మల్లూరు తాండ గ్రామంలో తాగునీటిని అందించే మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ అపరిశుభ్రంగా ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. శుక్రవారం నవతెలంగాణ వెళ్లి పరిశీలించగా మంచినీటి వాటర్ ట్యాంక్ పాకురుతో నిండి అపరిశుభ్రంగా నీరు వాటర్ ట్యాంక్‌లో ఉన్నాయి. నిబంధనల ప్రకారం తాగునీటి సరఫరా మంచినీటి ట్యాంక్‌ని నెలకు మూడుసార్లు శుభ్రపరచాల్సి ఉండగా గత నెల రోజుల నుండి శుభ్రపరచలేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కలుషిత నీటిని తాగి అనారోగ్య పాలైతే బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తున్నారు. అసలే కలుషిత నీటి వల్ల అనేక వ్యాధులు వస్తున్నాయి. గ్రామానికి ప్రత్యేక అధికారి మండల అభివృద్ధి అధికారి ఉన్న కనీసం గ్రామం యొక్క పారిశుద్ధంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వరి కొనుగోలు వెంటనే చేపట్టాలి


వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

వరి కొనుగోలు వెంటనే ప్రారంభించాలని మండల కిసాన్ సాంఘ్ నాయకులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ సువర్ణకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులు వరి కోతలు చేపట్టి నెలరోజులవుతున్న కాంటాలు నిర్వహించకపోవడం దారుణమని, అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం ఆరబెట్టడానికి సరిపడే తాటి పత్రాలు అందజేయాలని, రైతు పండించే ప్రతి పంటకు రూ 500 బోనస్ చెల్లించాలని, వరి ధాన్యం 40 కిలోల 650 గ్రాములు మాత్రమే తూకం వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు నా రెడ్డి రాజిరెడ్డి, గాండ్ల సాయిలు, జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్రావు, రైతులు కిరణ్ కుమార్‌రెడ్డి, సూతరి నరేష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మెన్, డైరెక్టర్

నవతెలంగాణ-భిక్కనూర్

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం మండలంలోని జంగంపల్లి గ్రామంలో సొసైటీ చైర్మెన్, డిసిసిబి డైరెక్టర్ సిద్దరాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి 2320, బి గ్రేట్ ధాన్యానికి 2300 రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ వాసు, సీఈఓ రమేష్, డైరెక్టర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలో ఆయా గ్రామాలలో గురువారం దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నరక చతుర్దశమి పురస్కరించుకొని ఉదయం అక్క చెల్లెలు వారి అన్నలకు హారతులు మిఠాయిలు ఇచ్చినారు అనంతరం టపాసులు పేల్చారు. దీపావళి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు సాయంత్రం వ్యాపార సముదాయాల వద్ద విద్యుద్దీపాల అలంకరణతో పాటు లక్ష్మీ పూజల కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ దీపాలను వెలిగించారు లక్ష్మీ పూజల అనంతరం టపాసులు పేర్చి మిఠాయిలు పంపిణీ చేశారు.

అందరికీ ఆదర్శం.. ఇందూరు యువత

- అనాథలకు, అభాగ్యులకు సేవా చేయడం గొప్ప విషయం
- తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

అందరికీ ఆదర్శంగా ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యక్రమాలు నిలుస్తున్నాయని, అనాథలకు, అభాగ్యులకు సేవ చేయడం గొప్ప విషయమని తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నూడా చైర్మన్ కేశవేణు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎవరూ చేయలేని సేవలు ఇందూరు యువత చేస్తుందని మానవత్వానికి ప్రతీకగా ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ నిలుస్తుందని పిలుపునిచ్చారు. మనశ్శాంతి కోవెల ఆశ్రమ నిర్మాణానికి కృషి చేస్తామని చెప్పారు. అంతరెడ్డి రాజిరెడ్డి మాట్లాడుతూ.. మానవ సేవే మాధవ సేవ అన్న మాటను నిజం చేస్తూ చూపిస్తున్న వీరి సేవలు మరువలేనివన్నారు. ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ.. నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కేశవేణు మాట్లాడుతూ.. నిరంతర అన్నదానం, అనాథ శవాలకు అంత్యక్రియలు, మతిస్థిమితంలేని విదివంచితులు సపర్యాలు చేయడం ఆ సేవలు కేవలం ఇందూరు యువతకే సాధ్యమన్నారు. తమవంతు సహకారం ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థకు ఎల్లప్పుడూ ఉంటుందని మంచి కార్యక్రమాలకు తోడుగా ఉంటామని అన్నారు. ఆ సంస్థ అధ్యక్షుడు చిట్టిమిల హరిప్రసాద్ మాట్లాడుతూ.. తమ సేవా సంస్థ నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. అనంతరం సంస్థ వ్యవస్థాపకులు మద్దుకూరి సాయిబాబు అతిథులతో మిడ్ నైట్ స్పెషల్ బేడ్షీట్స్ డ్రైవ్ కార్యక్రమం (అనాథలకు, అభాగ్యులకు విదిలించితులకు దుప్పట్లు పంపిణీ) ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు దారం గంగాధర్, సిర్ప లింగం, మద్ది గంగాధర్, వాల బాలకిషన్, లక్కంపల్లి సంజీవరావ్, రాజేష్ శర్మ, గైని గంగారం, జంగం రాజు, ఇందూరు యువత కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పలువురిని సన్మానిస్తున్న మద్దుకూరి సాయిబాబు

పూర్తి స్థాయిలో శ్రీరాంసాగర్ నీటిమట్టం


నిండుకుండలా తలపిస్తున్న శ్రీరాంసాగర్ జలాశయం

నవతెలంగాణ-మెండోరా

ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయని శ్రీరాంసాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం కలిగి నిండుకుండలా తలపిస్తుంది. ప్రాజెక్టులోకి పరిసర ప్రాంతాల నుండి ప్రస్తుతం 6830 క్యూసెక్కుల నీరు చేరుతుండగా ప్రాజెక్టు నీటిమట్టం తగ్గకుండా దిగువకు మిగులు జలాలు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు 91 టిఎంసిలు కాగా ప్రాజెక్టు అడుగు భాగాన మట్టి కూరుకుపోవడంతో 0.5 టిఎంసిల నీటి నిలువ తగ్గి 1091 అడుగులు 80.501 టిఎంసిల నీరు కలిగి పూర్తిస్థాయిలో నిండుకుని నిండుకుండలా తలపిస్తుంది. ప్రాజెక్టులోకి 6830 క్యూసెక్కుల నీరు కొనసాగుతుండగా 5454 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు నుండి విడుదల అవుతుండగా ఎస్కేప్ గేట్ల ద్వార 4000 క్యూసెక్కుల నీటిని గోదావరి నదిలోకి వదులుతూ, లక్ష్మి కాలువ ద్వార 150 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వార 500 క్యూసెక్కుల సాగునీటిని అందిస్తున్నారు. మిషన్ భగీరథ ద్వార 231 క్యూసెక్కుల తాగునీటిని సరఫరా చేస్తుండగా.. 573 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు నుండి వృథాగా ఆవిరి అవుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు.

కాకతీయ కాలువకు నిలిచిన నీటి విడుదల..

కాకతీయ ప్రధాన కాలువలో ఓ వ్యక్తి గల్లంతు కావడంతో గల్లంతైన వ్యక్తి దొరికే వరకు రెస్క్యూ ఆపరేషన్ పూర్తి అయ్యేవరకు ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం కాకతీయ కాలువకు విడుదలయ్యే నీటిని మళ్లించి ఎస్కేప్ గేట్ల ద్వార గోదావరి నదిలోకి వదిలినట్లు ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు. రెస్క్యూ ఆపరేషన్ పూర్తయిన తరువాత యధావిధిగా కాకతీయ ప్రధాన కాలువకు నీటి విడుదల కొనసాగిస్తామని తెలిపారు.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి..

ఎస్కేప్ గేట్ల ద్వార గోదావరి నదిలోకి నీటి విడుదల చేసినందున మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని ప్రమాదాలు జరుగకుండా పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు అధికారులు విజ్ఞప్తి చేశారు.

సర్వే సామగ్రి పంపిణీ


సర్వే సామగ్రిని పంపిణీ చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని 132 మంది ఎన్యూమరేటర్‌లకు ఇంటింటి సర్వే చేపట్టేందుకు కావాల్సిన సామగ్రిని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. మూడు రోజులు ఇంటింటి సర్వే జాబితా తయారు చేసిన తర్వాత సోమవారం నుంచి సర్వే మొదలు పెట్టనున్నట్టు ఎంపిడివో రాజేశ్వర్ తెలిపారు.

ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు

- 12వేల మంది మహిళలకు సెల్ఫ్ డిఫెన్స్‌లో శిక్షణనివ్వడంతో..

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

12,000 మంది మహిళలకు 03.03.2024వ తేదీన తైక్వాండో ప్రధాన కార్యదర్శి, కోచ్ మనోజ్ ఆధ్వర్యంలో సెల్ఫ్ డిఫెన్స్‌లో శిక్షణనిచ్చారు. అందులో భాగంగా ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు సాధించారు. దీంతో ఆయన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ ప్రశంసపత్రాన్ని జిల్లా జడ్జ్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 12,000 మంది మహిళలకు సెల్ఫ్ డిఫెన్స్ నేర్పించడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ మహత్తర కార్యాక్రమానికి జిల్లా జడ్జ్ కుంచాల సునీత ఆర్గనైజింగ్ చేయడంతోనే ఇంత పెద్ద కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ప్రతి మహిళా తనను తాను కాపాడుకోవడానికి ఈ సెల్ఫ్ డిఫెన్స్ ప్రస్తుతం రోజుల్లో చాలా అవసరమని అన్నారు. ఈ అవకాశాన్ని ఇచ్చినందుకు నిజామాబాద్ జిల్లా జడ్జి సునీత కుంచాల, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.


ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న మనోజ్

ఇంటింటి సర్వేపై విస్తృత ప్రచారం చేయాలి


ఇంటి తలుపులకు స్టిక్టర్ వేస్తున్న అధికారులు

నవతెలంగాణ-బీబీపేట్

ఇంటింటి సర్వేపై విస్తృత ప్రచారం చేయాలని అధికారులు సూచించారు. మండలానికి 57 ఎన్యూమరేటర్‌లు, ఆరుగురు సూపర్‌వైజర్‌లు, మండల ప్రత్యేక అధికారిని కేటాయించారు. కాగా శుక్రవారం బీబీపేట్, తుజాల్‌పూర్ గ్రామాల్లో సందర్శించారు. ఇట్టి సర్వేను సుమారుగా 795 మంది కుటుంబాలు ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించినట్టు తెలిపారు. ఇంకా కుటుంబాలు పెరిగే అవకాశం ఉంది. కాబట్టి ఇట్టి విషయాన్ని విస్తృత ప్రచారం చేసి విజయవంతం చేయాలని ప్రజలను ప్రజాప్రతినిధులను స్థానిక ఎంపీడీవో బంతిపూల చంద్రోదయ కుమార్ కోరారు.

ఆశా దినోత్సవం


ఆశా దినోత్సవంలో పాల్గొన్న ఆశాలు

నవతెలంగాణ-సదాశివనగర్

బేటీ బచావ్, బేటీ పడావ్ అనే ఇతివృత్తంతో పిహెచ్ సి సదాశివనగర్‌లో శుక్రవారం ఆశా దినోత్సవ సమావేశం శుక్రవారం నిర్వహించారు. కాగా ఇటీవల కాన్పుల్లో పురుష, స్త్రీ నిష్పత్తి 12:22 ఉన్నట్టు తెలిపారు. గర్భిణీలు ముందస్తు నమోదును మెరుగుపరచడానికి, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను మెరుగుపరచడానికి ఎం.ఓ ఆశాలను ప్రోత్సహించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని, దీనిపై కుటుంబీకులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశాన్ని ఎంఓ పిహెచ్ సి సదాశివనగర్ డాక్టర్ అస్మా అఫ్షీన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాగరాజు నిర్వహించారు.

అసంబద్ధ డిప్యూటేషన్లపై విచారణ జరిపించాలి

- ఎమ్మెల్యేకు టీపిటిఎఫ్ ఆధ్వర్యంలో వినతి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలో ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా చాలా మండలాల నుండి జిల్లా కేంద్రానికి వివిధ క్యాడర్ల ఉపాధ్యాయులను మౌఖిక డిప్యూటేషన్లు పెట్టారని, ఈ అసంబద్ధ డిప్యూటేషన్ ల పై విచారణ జరిపించాలని శుక్రవారం కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి టీపిటిఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 25 విరుద్ధంగా ఈ డిప్యూటేషన్ లో జరిగినయని, వీటి పైన సమగ్రమైన విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కు రిప్రజెంటేషన్ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సిహెచ్ లింగం పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని మంభోజిపేట గ్రామంలో శుక్రవారం పశువులకు గాలికుంటు టీకాలు అందజేసినట్టు పశు వైద్య ఉప అధికారి రవికుమార్ తెలిపారు. ఉదయం గ్రామ సచివాలయం సమీపంలో గాలికుంటు టీకాలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. 265 గేదెలు 56 ఆవులు 12 ఎద్దులకు టీకాలు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ రవి గోపాలమిత్ర ఎజాస్ రమేష్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సాయిలు, గ్రామస్తులు పాల్గొన్నారు.